విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

శుక్రవారం 24 జనవరి 2025 8 పేజీలు

నిత్యం ట్రాఫిక్ ఇక్కట్లు

- పట్టించుకోని అధికారులు
- రోడ్డుకిరువైపులా పార్కింగ్
- పోలీసుల మాటలు బేఖాతరు

విశాలాంధ్ర - పిఠాపురం : అభివృద్ధిలో ముందున్నామని స్టేట్మెంట్ల వరకే పరిమితం అవుతున్న పిఠాపురం నియోజకవర్గంలో ట్రాఫిక్ పరిస్థితి అధ్వానంగా మారింది. దీనిపై సంబంధిత అధికారులు కనీసం పట్టించుకోకపోవడం గమనార్హం. స్థానిక ఉప్పాడ సెంటర్ నుంచి చర్చి సెంటర్ వరకు వెళ్లాలంటే సుమారు అరగంట సమయం పైనే పడుతుంది. రోడ్డుకు ఇరువైపులా వాహనాలను ▶మిగతా 2లో..

నర్సింగ్ అక్రమాలపై కొరడా !

- నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు నర్సింగ్ స్కూల్స్, కాలేజీలు
- అక్రమాలపై కొరడా ఝుళిపించనున్న ప్రభుత్వం
- క్షేత్రస్థాయి తనిఖీలకు రంగం సిద్ధం
- ఫిబ్రవరి 1 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

ప్రైవేటు నర్సింగ్ కళాశాలల అక్రమాలపై కొరడా ఝుళిపించేందుకు రంగం సిద్ధమైంది. యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను పక్కనపెట్టి ఇష్టానుసారంగా కళాశాలలు, స్కూల్స్ నడుపుతున్నారు.ఇప్పటికే వీటిపై గత కొన్నేళ్లుగా ప్రభుత్వానికి ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయి. స్పందించిన రాష్ట్ర వైద్య విద్యా సంచాలకులు 6 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి సర్టిఫికెట్ల పరిశీలన, అనంతరం క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి బోగస్ కళాశాలలపై వేటువేసేలా యాక్షన్ ప్లాన్ రూపొందించారు.

తాజా పరిణామాలు బోగస్ కళాశాలల నిర్వాహకులలో గుబులు పుట్టిస్తున్నాయి. నర్సింగ్ విద్యకు ప్రాధాన్యత పెరిగిన నేపథ్యంలో ఇబ్బడి ముబ్బడిగా కళాశాలలు వెలుస్తున్నాయి.

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: నర్సింగ్ విద్యకు ప్రాధాన్యత పెరిగిన నేపథ్యంలో ఇబ్బడి ముబ్బడిగా కళాశాలలు వెలుస్తున్నాయి. దీంతో అక్రమాలు జోరుగా సాగుతున్నాయి. గత కొద్దిరోజులుగా ప్రైవేటు నర్సింగ్ కళాశాలల అక్రమాలపై డిఎంఇకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో తనిఖీలు షురూ చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. నర్సింగ్ కళాశాలలు నిబంధనల ప్రకారం నడవడం లేదంటే అతిశయోక్తి కాదు. నర్సింగ్ కళాశాల లేదా స్కూల్ ఏర్పాటు చేయాలంటే నిర్వాహకుడికి ఖచ్చితంగా ఆసుపత్రి ఉండాలి. లేనిపక్షంలో ఏదైనా ఆసుపత్రితో 33 సంవత్సరాల పాటు ఎంఓయు కుదుర్చుకోవాలి. కొందరు ప్రబుద్ధులు నిబంధనలకు తూట్లు పొడిచారని ఆరోపణలు ఉన్నాయి. ఒకే ఆసుపత్రిలో మూడు నుంచి నాలుగు కళాశాలలు, స్కూల్స్ కుదుర్చుకోవడం, ▶మిగతా 2లో..

సస్పెండైన రెండు నెలలకే పోస్టింగ్

- లక్షలు చేతులు మారిన వైనం
- రాజకీయ పలుకుబడితో చక్రం తిప్పిన లైన్‌మెన్
- ట్రాన్స్‌కోలో విడ్డూరం

విశాలాంధ్ర - అమలాపురం : తన నిర్లక్ష్యంతో ఇద్దరు హెల్పర్ల ప్రాణాలు హరించిన లైన్ మెన్ మాగాపు శ్రీను సస్పెండ్ అయిన రెండు నెలలు తిరగకుండానే ఎంక్వైరీ రిపోర్ట్ రాకుండానే మళ్ళీ పోస్టింగ్ ఇచ్చేసారు. డబ్బులతో ఎంతటి తప్పునైనా కప్పేయవచ్చునని నిరూపించి లక్షలకు లక్షలు చేతులు మారినట్లు ఆరోపణలున్న ఈ వ్యవహారంలో ఉన్నతాధికారులు లైన్‌మెన్ మాఘాపు శ్రీనుకు ఒకే గ్రామంలో 16 ఏళ్లు పనిచేసిన పక్క గ్రామంలోనే పోస్టింగ్ ఇచ్చి తమ స్వామి భక్తిని చాటుకున్న వైనం ట్రాన్స్‌కోను కోనసీమ వ్యాప్తంగా నవ్వులపాలు చేసింది. రాజకీయ నాయకుల అండదండలతో ఎంతమంది హెల్పర్ల నైనా మింగేయడానికి అధికారులు లైన్ మెన్‌కు లైసెన్సు ఇచ్చినట్లు అయిందని ప్రజాసంఘాల ▶మిగతా 2లో..

క్యారీ బ్యాగులు, డిస్పోజబుల్ గ్లాసుల నిషేధం

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: భీమవరం పట్టణంలో క్యారీ బ్యాగ్‌లు, డిస్పోజబుల్ టీ కప్స్ ఫిబ్రవరి 1 నుండి నిషేధానికి కట్టుదిట్టమైన చర్యలను తీసుకున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లా జాయింట్ కలెక్టర్, డిఆర్వో, మున్సిపల్, డి ఆర్ డి ఎ, డిపిఓ, మెప్మా అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశమై ప్లాస్టిక్ నిరోధానికి చేపట్టవలసిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భీమవరం పట్టణాన్ని ప్లాస్టిక్ ఫ్రీ గా తీర్చిదిద్దేందుకు అడుగులు వేస్తున్నామన్నారు. తొలి అడుగుగా జిల్లా కలెక్టరేట్లో వాటర్ బాటిల్స్, డిస్పోజబుల్ ప్లేట్స్, టీ గ్లాసులు స్థానంలో అన్నింటిని స్టీల్ ఐటమ్స్‌ను ఏర్పాటు చేశారు. ఇప్పటికే పట్టణంలో వినియోగంలో ఉన్న క్యారీ బ్యాగులు, డిస్పోజబుల్ టీ గ్లాసులను ఫిబ్రవరి మొదటి వారం నుండి ఎట్టి పరిస్థితుల్లో అనుమతించబోమని హెచ్చరించారు. వీటికి ప్రత్యామ్నాయంగా ఈ లోపు 120 మైక్రాన్లు క్యారీ బ్యాగులు లేదా గుడ్డ సంచులు, టీ వినియోగానికి గాజు గ్లాసులు లేదా సిరామిక్ కప్పులను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఫిబ్రవరి మొదటి రోజు నుండి షాపులు, స్టాల్స్‌లో టీములు ఆకస్మిక తనిఖీలు చేపట్టనున్నాయని తెలిపారు. నిబంధనలను అతిక్రమించి వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై తొలి విడతగా అపరాధ రుసుమును విధించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రజలు, వ్యాపారస్తులు ఆలోచన ధోరణిలో మార్పు వస్తేనే అనుకున్న లక్ష్యాలను వేగంగా సాధించగలమన్నారు. త్వరలో ఫంక్షన్ హాల్స్, వివిధ అసోసియేషన్స్ యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి వివిధ స్థాయిల్లో వినియోగిస్తున్న ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా ఏ ఏ వస్తువులను వినియోగించాలో సూచించడం, సలహాలను స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. క్లాత్ ▶మిగతా 2లో..

బాలికోన్నత పాఠశాలలో సమస్యల కొలువు

- పనిచేయని ఆర్వో ప్లాంట్
- నేలపైనే భోజనాలు
- పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సమస్యలు కొలువుదీరాయి. దీంతో బాలికలకు చదువు బరువవుతోంది. 560 మంది బాలికలు ఉన్న ఈ పాఠశాలలో బాలికలు త్రాగేందుకు నీరులేక, భోజనం చేసే వసతిలేక నిత్యం ఇబ్బంది పడుతున్నారు. విశాలమైన ప్రాంగణం ఉన్నప్పటికీ బాలికలు భోజనం చేసేందుకు కనీసం వసతి లేకపోవడంతో బాలికలు కఠిక నేలపై కూర్చుని భోజనాలు చేయాల్సి వస్తుంది. ప్రభుత్వ విద్య కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు ఎంతో గొప్పగా ప్రచారాలు చేస్తున్నా క్షేత్రస్థాయిలో ఈ తరహా ఇబ్బందులు తప్పడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఆరో తరగతి నుంచి 10 ప్లస్ వరకు ఈ పాఠశాలలో బాలికలు విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తు న్నారు. పాఠశాల తరగతి గదులకు కొత్త భవనాలు నిర్మిస్తున్నా బాలికల భోజన సదుపాయానికి ఒక డైనింగ్ హాలు లేకపోవడంతో ఎండైనా, వానైనా ఆరుబయటే బాలికలు నిలబడి, కఠిక నేలపై కూర్చుని

భోజనాలు చేయాల్సి వస్తుంది. పాఠశాలలో ఉన్న ఆర్వో ప్లాంట్ చాలాకాలం క్రితమే పూర్తిగా పాడైపోయింది. పనిచేయకపోవడంతో బాలికలు త్రాగేందుకు రక్షిత మంచినీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వేసవికాలం ప్రవేశిస్తున్న నేపథ్యంలో బాలికలకు త్రాగునీరు అవసరం మరింతగా ఉంది. తరచూ పాఠశాలను విద్యాశాఖ అధికారులు సందర్శిస్తున్నా పాఠశాలలో త్రాగునీరు, డైనింగ్ హాలు విషయాలపై దృష్టి పెట్టకపోవడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. కేవలం బాలికల పాఠశాల అయిన ఈ పాఠశాలలో బాలికా విద్యకు అధిక ప్రాధాన్యత నిస్తూ అన్ని సదుపాయాలు కల్పించాల్సి ఉండగా విద్యాశాఖ అధికారులు ఈ పాఠశాలను నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దాతలు ముందుకు రావాలి -విద్యా కమిటీ

బాలికల విద్యను ప్రోత్సహించేందుకు, పాఠశాలలో సదుపాయాల కల్పనకు దాతలు ముందుకు రావాలని బాలికల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. విద్యా కమిటీ చైర్మన్, సభ్యులు ఈ విషయంలో దాతల సహకారాన్ని కోరుతున్నారు. కనీస అవసరాలైన త్రాగునీరు, డైనింగ్ హాలు ఏర్పాటుకు సహృదయంతో దాతలు ముందుకు వచ్చి పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని వారు కోరుతున్నారు. విద్యాశాఖ అధికారులు సైతం ఈ విషయంలో చొరవ తీసుకుని విద్యార్థుల ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరించి పాఠశాలలో మంచి వాతావరణం కల్పించాలని వారు కోరుతున్నారు.

ఉచిత పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర- పాలకోడేరు: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఉచితంగా నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని

మండల పశు వైద్యాధికారి డాక్టర్ హేమ అన్నారు. పాలకోడేరు మండలం గొరగనమూడి గ్రామంలో గురువారం గ్రామ సర్పంచ్ గొట్టుముక్కల వెంకట శివరామరాజు చేతుల మీదుగా ఉచిత పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి మాట్లాడుతూ ఉచిత పశు వైద్య శిబిరాలు ఈనెల 31 వరకు కొనసాగుతాయని, నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం మండలంలోని అన్ని గ్రామాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్ వెంకట శివరామరాజు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలంతా పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. గురువారం నిర్వహించిన ఈ శిబిరంలో 49 పశువులకు, 40 దూడలకు, 10 గొర్రెలకు, 400 కోళ్లకు నట్టల నివారణ మందులు వేసినట్లు, 25 పశువులకు గర్భకోశ పరీక్షలు చేసి చికిత్స అందించినట్లు పశు వైద్యాధికారి డాక్టర్ హేమ తెలిపారు. ఈ శిబిరంలో ఎంపీటీసీ సభ్యులు వేగేశ్న పార్వతి కృష్ణకుమారి, బిజెపి నాయకులు ఇంజేటి వెంకటేశ్వర్లు, జయ లక్ష్మి, నారం నాయుడు, బ్రహ్మేశ్వరరావు, పాండురంగా రావు, గోపాలమిత్ర, సంబంధిత పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అమిత్‌షాను అరెస్టు చేయాలి

ఏఐసిసి రాష్ట్ర జాయింట్ సెక్రటరీ డాక్టర్ పాలక్ వర్మ

విశాలాంధ్ర -భీమవరం: పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్ పై అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలు దారుణమని, అమిత్ షాను వెంటనే అరెస్టు చేయాలని, కేంద్ర కేబినెట్ నుండి తొలగించాలని ఏఐసిసి రాష్ట్ర జాయింట్ సెక్రటరీ డాక్టర్ పాలక్ వర్మ

డిమాండ్ చేశారు. అంబేద్కర్ పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాలక్ వర్మ మాట్లాడుతూ అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ "జై బాపూ, జై భీమ్, జై సవిధాన్" నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపట్టామ న్నారు. అమిత్‌షాను పదవి నుంచి తొలగించే వరకు ఉద్యమాలు కొనసాగిస్తామని ఆమె హెచ్చరించారు. అనంతరం కాంగ్రెస్ కార్యాలయం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇంచార్జి కిరణ్ రెడ్డి, పశ్చిమగోదావరి జిల్లా ఇంచార్జి నాగేశ్వరరావు, పాతపాటి హరికుమారరాజు, భీమవరం అసెంబ్లీ కాంగ్రెస్ కన్వీనర్ అంకెం సీతారామ్, జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ కాకర రాజ్ కుమార్, నియోజకవర్గ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా నేతాజీ జయంతి

విశాలాంధ్ర -భీమవరం : నేతాజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని, నేతాజీ కలలను సాకారం చేయాలని ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి లంక కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ 129వ జయంతిని

పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా లంక మాట్లాడుతూ బ్రిటిష్ దాస్య శృంఖలాల నుంచి విముక్తి కలిగించడానికి నేతాజీ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. తెల్ల దొరలు పోయినా నల్ల దొరల కబంధ హస్తాల్లో ప్రజలు నలిగిపోతున్నారని, నేతాజీ స్ఫూర్తితో మరో పోరాటం చేయాలని లంక పేర్కొన్నారు. కార్యక్రమంలో మధుబాబు, దండు శ్రీనివాసరాజు, వనమయ్య, వెంకటపతి రాజు, శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

నిషేధం (1వ పేజీ తరువాయి)

బ్యాగులను కూడా పెద్ద ఎత్తున తయారు చేసి మార్కెట్లో అందుబాటులో ఉంచడానికి చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. అరటి ఆకులు, చేతితో కుట్టిన ఇస్తరాకులు, తాటాకు బుట్టలతో భోజనాలు రోజుల నుండి నేడు ప్రతి ఒక్కదానికి ప్లాస్టిక్ కవర్లనే వినియోగించడంతో మనుషులకు, గ్రాగునీటి వనరులకు, జంతువులకు భారీ ముప్పు కలుగుతుందని తెలిసి కూడా దానివైపే ఎందుకు అడుగులు వేస్తున్నామో ప్రతి ఒక్కరూ ఒకసారి ప్రశ్నించుకోవాలన్నారు?

సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, డిఆర్డిఏ పిడి ఎంఎస్ఎస్ వేణుగోపాల్, డిపిఓ అరుణశ్రీ, మెప్మా అధికారి జి.పార్వతి, సంఘ సేవకులు సిహెచ్ కృష్ణంరాజు, చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు పాల్గొన్నారు.

పోస్టింగ్ (1వ పేజీ తరువాయి)

నాయకులు ట్రాన్స్ కో అధికారుల తీరుని విమర్శిస్తున్నారు. ఐ పోలవరం మండలం మురమళ్ళలో 16 ఏళ్లుగా ఎలాంటి బదిలీలు లేకుండా రాజకీయ నాయకులు, ఉన్నతాధికారుల అండతో ఉద్యోగం చేస్తున్న లైన్ మెన్ మాగాపు శ్రీను తనవద్ద హెల్పర్‌గా పనిచేస్తున్న మోర్త సాయిరాం అనే హెల్పర్‌ను బలవంతంగా హైపవర్ లైన్ పైకి ఎక్కించి అతని దుర్మరణానికి కారణమయ్యాడని లైన్‌మెన్ మాగాపు శ్రీనును అధికారులు సస్పెండ్ చేశారు. ఈ ట్రాన్స్‌కోలో పేరుకే లైన్మెన్ ఏనాడూ ఉద్యోగం చేయని ఘనుడు హెల్పెర్లతో పని చేయించి ఇద్దరు హెల్పర్ల ప్రాణాలు హరించిన లైన్ మెన్ భాగోతం రోజుకో ములుపు తిరుగుతోంది.

ఐ పోలవరం మండలంలో రాజకీయ నాయకుల సేవలో తరించే లైన్ మెన్ మాగాపు శ్రీను అతనే లైన్మెన్ అతనే ఎఇ అతనే ఎడిఇగా వ్యవహరిస్తారని అతను వున్న మండలంలో ఇతర పై క్యాడర్ అధికారులు ఎవరు పనిచేయలేక బదిలీ చేయించుకుని వెళ్లి పోతారు. ఒక సాధారణ లైన్ మెన్ ట్రాన్స్ కో సిఎండి స్థాయి అధికారిని ఒక నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధి స్వయంగా రంగంలోకి దిగి సస్పెన్షన్ ఎత్తివేయాలని వత్తిడి చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. తన ఉద్యోగ కాలంలో జీ వేమవరం, కొమరగిరి, గ్రామాల్లో కొద్దికాలం లైన్మెన్‌గా పనిచేస్తూ అత్యధికంగా మురమళ్ళ గ్రామంలో 16 సంవత్సరాలు నిబంధనలకు విరుద్ధంగా లైన్మెన్‌గా పనిచేసిన మాగాపు శ్రీను రాజకీయ నాయకులకు తొత్తుగా వ్యవహరిస్తూ విద్యుత్ శాఖలో పైరవీలు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా కొమరగిరిలో లైన్మెన్‌గా పనిచేస్తున్న సమయంలో ఒక ప్రైవేటు వర్కర్ దొంగ ప్రభాకరరావు చేత ఆక్వా చెరువుల దగ్గర ట్రాన్స్ఫర్మర్ రిపేరు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఇటీవల అన్నంపల్లి టోల్గేట్ దగ్గర 11 కెవి స్తంభంపై తాత్కాలిక వర్కర్ మోర్త సాయి విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు.

ఈ ఘటనలో లైన్మెన్ మాగాపు శ్రీనును సస్పెండ్ చేశారు. ఇప్పటివరకు గతంలో మరణించిన హెల్పర్ కుటుంబానికి గాని, ఇటీవల దుర్మరణం చెందిన మోర్త సాయి కుటుంబానికి గాని ఎలాంటి ఆర్థిక సహాయం అందించలేదని వారి కుటుంబాలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ కారకులైన అధికారులు, సిబ్బంది పై శాపనార్థాలు పెడుతున్నారు.

ట్రాఫిక్ ఇక్కట్లు (1వ పేజీ తరువాయి)

నిలిపి వేస్తుండడంతో ట్రాఫిక్ అంతరాయం వాటిల్లుతోంది. ఆటోల రద్దీ ఎక్కువ అవ్వడంతో ఇష్టానుసారంగా రోడ్డుపై ఇంకో వాహనం వెళ్లకుండా అడ్డుగా నిలిపివేస్తున్నారు. దేశంలోనే పిఠాపురాన్ని ప్రత్యేక స్థానంగా నిలుపుతాను అన్న స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి ఈ విషయం తెలియకపోవడం శోచనీయం. ఇన్చార్జిగా వ్యవహరిస్తున్న మర్రెడ్డి శ్రీనివాస్ కనీస దృష్టి పెట్టకపోవడం వాహన దారులను ఇబ్బందికి గురిచేస్తుంది. సుమారు 54 గ్రామాల ప్రజలు పిఠాపురం పట్టణానికి నిత్యం వస్తుంటారు.

ద్విచక్ర వాహదారులు రోడ్డుకి ఇరువైపులా ఇష్టానుసారంగా వాహనాలు నిలిపివేయడంతో బాటసారులకు, వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. దీనిపై ఇప్పటికే స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి చర్యలు చేపడుతున్నా పోలీసుల మాట మాకు ఏంటన్నట్టు బేఖాతర్ చేస్తున్నారు.

పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కొరడా (1వ పేజీ తరువాయి)

ఒక చిరునామాలో అనుమతి తీసుకొని మరో ప్రాంతంలో నిర్వహించడం, దొంగ జిఒ లతో కళాశాలలు నిర్వహిస్తున్నారని డిఎంఈ కి ఫిర్యాదులు వెళ్లాయి.దీంతో ప్రభుత్వ వైద్య కళాశాలలో విధులు నిర్వహిస్తున్న అడిషనల్ డైరెక్టర్లు,అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు 18 మందితో 6 బృందాలను ఏర్పాటు చేశారు. తనిఖీల నిర్వహణకు సంబంధించి ఇటీవల శిక్షణ ఇచ్చారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి నర్సింగ్ కళాశాలలు, స్కూల్స్ సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసి అన్ని పకడ్బందీగా ఉన్నట్లయితే క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని డిఎంఈ ఆదేశాలు జారీ చేశారు.ఈ బృందాలు ఇచ్చే నివేదికల ఆధారంగా ఉల్లంఘనులపై చర్యలు చేపట్టనున్నారు.

అక్రమాలకు అంతులేదు

ప్రైవేట్ నర్సింగ్ కళాశాలలు, స్కూళ్లలో లెక్కలేనని అక్రమాలు జరుగుతున్నాయి అన్నది బహిరంగ రహస్యం. ఈ అక్రమాలన్నీ నర్సింగ్ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నాయనేది వాస్తవం. ఫిర్యాదుల నేపథ్యంలో డీఎంఈ తనిఖీలకు రంగం సిద్ధం చేయడంతో కొందరు నిర్వాహకులతో పాటు,ఇటు నర్సింగ్ అధికారులలో ఆందోళన మొదలైంది.

వారి కనుసన్నల్లోనే....

పారా మెడికల్ బోర్డు కార్యాలయం అడ్డాగా ప్రైవేట్ నర్సింగ్ కళాశాలలు,స్కూళ్లలో అక్రమాలు జరుగుతున్నట్లు బలమైన ఆరోపణలు ఉన్నాయి. డీఎంఈకి ఫిర్యాదులు అందే వరకు పారామెడికల్ బోర్డులో ఏం జరుగుతోంది..? నర్సింగ్ డిడి, నర్సింగ్ కౌన్సిల్ అధికారులు ఏ స్థాయిలో విధులు నిర్వహిస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది అంటే పాలన ఏ విధంగా సాగుతుందో అర్థం అవుతోంది. క్షేత్రస్థాయిలో పారదర్శకంగా తని ఖీలు నిర్వహించి చర్యలు చేపడితే నర్సింగ్ కళాశాలలో ఎక్కువ శాతం మూతపడే అవకాశాలు ఉన్నాయనే వాదనలు వినిపిస్తు న్నాయి. పారా మెడికల్ బోర్డు కార్యాలయంలో సర్టిఫికెట్ల పేరుతో దండిగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయి తనిఖీలలో ఇవన్నీ ఎక్కడ బయటపడతా యోనని అక్రమార్కులు హడలెత్తుతున్నారు.

పెంపుడు జంతువుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

విశాలాంధ్ర-లింగపాలెం: పశువుల సంరక్షణలో పెంపకపు దారులు ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశు వైద్యాధికారులు లింగయ్య, మహేష్ తెలిపారు. కలరాయన గూడెంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని

నిర్వహించారు. పశువులు,గొర్రెలు, మేకలు,కోళ్ల పెంపకంపై పలు సూచనలు చేశారు. పాల ఉత్పత్తిపై గ్రామీణ ప్రాంతాలలో అనేక మంది జీవనం సాగిస్తున్నారని వీరంతా పాల ఉత్పత్తిని పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. మూగజీవాల ఆరోగ్య సంరక్షణలో నిత్యం అప్రమత్తంగా ఉండాలని అన్నారు. గ్రామంలో జరిగిన వైద్య శిబిరాన్ని తెలుగుదేశం నాయకులు నందిగం సీతారాం తిలక్(బాబి) ప్రారంభించారు. శిబిరంలో పశువులకు గొర్రెలు మేకలకు వివిధ రకాల వ్యాధులు శోకకుండా వ్యాక్సిన్ వేశారు. వైద్య సహాయకులు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాల నివారణ

విశాలాంధ్ర - బుట్టాయిగూడెం: రోడ్డు భద్రతా నియమాలు పాటించడం వలన ప్రమాదాలను అరికట్టవచ్చని జంగారెడ్డిగూడెం వెహికల్ ఇన్స్పెక్టర్ ఎస్ఎస్ రంగనాయకులు అన్నారు. రహదారి భద్రత వారోత్సవాల సందర్భంగా స్థానిక

బస్టాండ్ వద్ద ఆటో, మ్యాక్స్ క్యాబ్ యూనియన్ సభ్యులకు రహదారి భద్రత నియమాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ వాహనాలను నడిపేవారు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రోడ్డు నియమాలు సరిగా పాటించకపోవడం వలన ప్రమాదాలు జరిగి వాహనదారులు మృత్యువాత పడుతున్నారని తెలిపారు. యూటర్న్ తీసుకునేటప్పుడు చుట్టూ ఉన్న వాహనాలను గమనించి వాహనాలను నడిపితే ప్రమాదాలు జరగని ఆయన తెలిపారు. వాహనాలు నడిపేటప్పుడు సెల్ ఫోన్ మాట్లాడుతూ నడిపితే ప్రమాదాలు జరుగుతాయని, వాహనాలు నడిపే సమయంలో సెల్ ఫోన్ లో మాట్లాడవద్దని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎంవిఐ సురేష్ బాబు, స్థానిక ఏఎస్సై కె. సోమరాజు విద్యా రోహిణి ప్రిన్సిపాల్ కె. రామకృష్ణ, కెఆర్పి ఆటో యూనియన్ అధ్యక్షులు తీగల గోపాలకృష్ణ, జాలపర్తి నాగు,సయ్యద్ బాజీ, ఆటో, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లు పాల్గొన్నారు.

జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: మండలంలో ఈనెల 25వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవంపై నిర్వహించే అవగాహన కార్యక్రమాలను విజయవంతం చేయాలని తహసీల్దార్ టి.సాయిబాబా తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ

ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఓట్ ఫర్ ష్యూర్ అనే నినాదంతో ఈనెల 25న మండలస్థాయిలో ఓటుహక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఓటుహక్కు వినియోగించుకోవడం, 18ఏళ్ళు నిండిన ప్రతిఒక్కరూ ఓటుహక్కు పొందడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమాలలో ఓటర్లంతా పాల్గొని ఓటర్ల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మధ్యాహ్న భోజన కార్మికుల తొలగింపు ఉపసంహరించుకోవాలి

విశాలాంధ్ర- ఏలూరు : నూజివీడు టౌన్‌లో గర్ల్స్ హైస్కూల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల ఏజెన్సీని, కార్మికులను తొలగించాలన్న ప్రతిపాదన వెంటనే ఉపసంహరించు

కోవాలని ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్, (ఏఐటీయూసీ అనుబంధం) ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా విద్యా శాఖాధికారి (డీఈవో) ఎస్.వెంకట లక్ష్మమ్మకి వినతిపత్రం ఇచ్చినట్లు ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రికట్ల త్యాగరాజు, చాట్ల పుల్లారావు, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి దాంగే, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.శివ చెప్పారు. గత 20 సంవత్సరాలు నుండి ఏజెన్సీని నడుపుతున్న పద్మ, ఇతర కార్మికులను తొలగించాలని తీర్మానం చేయడం చాలా దారుణం అని, ఎస్ఎంసి కమిటీల పేరుతో మధ్యాహ్న భోజన కార్మికుల మీద వేధింపులను ఆపాలని కోరారు. దీనితో పాటు జిల్లాలో సర్క్యులర్ జారీ చేయాలని డీఈఓను కోరారు. డీఈవోని కలిసిన వారిలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఎం.క్రాంతి కుమార్, ఎం.శ్రీరామ్ ఉన్నారు.

విజన్ ఉన్న నాయకుడు నారా లోకేష్

విశాలాంధ్ర- నూజివీడు: రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆధ్వర్యంలో నూజివీడులో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ బాబు 41వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. తెలుగు దేశం నాయకులతో కలిసి మంత్రి అదవి

ఆంజనేయ స్వామి గుడి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు . గాంధీ నగర్ నందన వనంలో ముగిసిన ర్యాలీ తరువాత భారీ కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు తినిపించి లోకేష్ బాబుకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియ జేశారు.

అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ లోకేష్ నాయకత్వంలో బహుళ జాతి సంస్థలు గూగుల్, రిలయన్స్ వంటి సంస్థలు రాష్ట్రంలో లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టాయన్నారు. లోకేష్ నాయకత్వంలో స్టీల్ దిగ్గజ సంస్థలు విశాఖపట్నంలో వేల కోట్లు పెట్టుబడులు పెట్టాయన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు ప్రజలు సహకరించాలన్నారు. భావితరాల అభివృద్ధే అజెండాగా పని చేస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని, ప్రపంచ దేశాలన్నీ పర్యటించి సాంకేతికను నూతన విధానాలన్ని జోడించి రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

నేతాజీకి నివాళి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : భారత జాతి విముక్తి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన స్వాతంత్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని గ్రంథ పాలకురాలు యు. రాముడు పేర్కొన్నారు. సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి సందర్భంగా స్థానిక శాఖ గ్రంథాలయం

వద్ద గ్రంథ పాలకురాలు రాముడు ఆధ్వర్యంలో నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యాన్ని తన సైనిక దళాలతో గడగడలాడించిన మహోన్నత వ్యక్తి నేతాజీ అని అన్నారు. ఆజాద్ హిందు ఫౌజ్ వ్యవస్థాపకులని, నేతాజీ కి జయంతిలే కానీ వర్ధంతులు లేవని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, చదువరులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే మహిళలపై దాడులు

ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం: మహిళల పట్ల ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిర్లక్ష్యం,చిన్నచూపు

కారణంగానే మహిళలపై దాడులు యధేచ్ఛగా కొనసాగుతున్నాయని, పసిపిల్లలు నుంచి వృద్ధుల వరకు అత్యాచారాలు,హత్యలకు గురవుతున్నారని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి అన్నారు. గురువారం స్థానిక కపర్ధీ భవన్ లో జరిగిన మహిళా సమాఖ్య పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశానికి మహిళా సమాఖ్య నాయకురాలు ఎన్.నాగలక్ష్మి అధ్యక్షత వహించారు. పుష్పకుమారి మాట్లాడుతూ మహిళల రక్షణకు చేసిన చట్టాలు సమర్ధవంతంగా అమలు చేయడం లేదన్నారు. మహిళల అభివృద్ధి, సాధికారతే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెపుతున్న ప్రభుత్వాలు ఆచరణలో చిత్తశుద్ధి కనపరచ టం లేదన్నారు.

ఎన్నికల ముందు చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు బిల్లు ఆమోదిం చిన కేంద్ర ప్రభుత్వం ఎందుకు అమలు జరపడం లేదని ప్రశ్నించారు. ఎన్నికల ముందు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన అమ్మఒడి, ఉచిత బస్సు సౌకర్యం లాంటి హామీలు ఎందుకు అమలు చేయడం లేదని కూటమి ప్రభుత్వాన్ని నిలదీశారు. గ్రామ,పట్టణ, మండల,జిల్లా అన్ని స్థాయిల్లోను మహిళా సంఘాలు నిర్మాణం చేసు కొని మహిళలకు ప్రభు త్వాలు ఇచ్చిన హామీలు అమలుకు, మహిళల పట్ల కొనసాగుతున్న వివక్ష, దాడులకు వ్యతిరేకంగా పోరాటాలకు సన్నద్ధం కావాలన్నారు.

నూతన కార్యవర్గం ఏకగ్రీవం

తాడేపల్లిగూడెం పట్టణ మహిళా సమాఖ్య నూతన

కమిటీ అధ్యక్షురాలిగా వద్దాది మేరీ, కార్యదర్శిగా ఎన్.నాగలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గురువారం కపర్ధీ భవనంలో జరిగిన పట్టణ మహిళా సమాఖ్య సమావేశం పట్టణ కమిటీని ఎన్నుకుంది.

ఉపాధ్యక్షురాలుగా బొక్కా స్వర్ణకుమారి, సహాయ కార్యదర్శిగా జె.సీత, కోశాధికారిగా ఎం.ప్రసన్న, కమిటీ సభ్యులుగా కర్రి సత్యవతి, ఎన్.సురేఖ, ఎ.ప్రభ, వి.పద్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రబీలో తగ్గిన వరి సాగు, పెరిగిన మొక్కజొన్న

విశాలాంధ్ర -లింగపాలెం: మెట్ట ప్రాంతమైన లింగపాలెం మండలంలోని చెరువులలో సమృద్ధిగా నీరు ఉన్నప్పటికీ ఈ ఏడాది రబీలో వరి సాగుపై రైతులు అంతగా ఆసక్తి చూపటం లేదు. మండలంలో ఈ ఏడాది అత్యధిక వర్షం పడటంతో చెరువులలో సమృద్ధిగా నీరు ఉన్నాయి. వీటిలో నీరు ఉండటం వల్ల భూగర్భ జలాలు ఆశాజనకంగా ఉన్నాయి. చెరువుల్లో ఉన్న నీటి ఆధారంతోనే మండలంలో వరి సాగు అధికంగా చేస్తారు. ఖరీఫ్ లో 6,500 ఎకరాలలో వరి సాగు చేశారు. దిగుబడులు ఆశా జనకంగా ఉన్నాయి. దాదాపు 11,600 మెట్రిక్ టన్నులు దిగుబడులు వచ్చాయి. విక్రయించిన ధాన్యానికి సకాలంలో ప్రభుత్వం దాదాపు రూ. 26 కోట్లు నిధులు జమ చేసింది. ప్రభుత్వం నుంచి ఆశా జనకమైన ప్రోత్సాహం ఉన్నప్పటికీ రబీలో వరి పంట వేయటానికి రైతులు అంతగా ఆసక్తి చూపటం లేదు. ఖరీఫ్‌లో వేసిన వరి పంట స్థానంలో రబీలో వరికి

ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న పంటను వేస్తున్నారు. దేశవాళీ మొక్కజొన్న కాకుండా విత్తనపు మొక్కజొన్న పంట వైపు రైతులు మొగ్గు చూపు తున్నారు.విత్తనపు మొక్కజొన్న పంట విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని, విత్తనాన్ని సరఫరా చేసే వారి నుంచి నష్టాలు వస్తే పరిహారం ఇవ్వాలనే ఒప్పందాన్ని లిఖిత పూర్వకంగా తీసుకోవాలని అధికారులు సూచించినప్పటికీ ఈ పద్ధతులను పాటించటం లేదు. గతంలో అనేక సీడ్ కంపెనీల మోసాలకు రైతులు నష్టపోయి ఆర్థికంగా దెబ్బతిన్నారు. పలు వివాదాలు చోటు చేసుకున్నాయి. ఇటువంటి పరిణామాల దృష్ట్యా అధికారులు అప్రమత్తమై రైతులకు నష్టం జరగకూడదనే ఉద్దేశంతో పలు సూచనలు చేస్తున్నారు. సీడ్ కంపెనీల ఆర్గనైజర్ల మీద ఉన్న నమ్మకంతో ఎటువంటి అగ్రిమెంట్ లేకుండానే మొక్కజొన్న పంట వేస్తున్నారు.

పరిస్థితులు ఆశాజనకంగా ఉంటే ఎటువంటి ఇబ్బందులు ఉండవు. నష్టాలు వచ్చినప్పుడే రైతులు అధికారుల చుట్టూ తిరుగుతారు. అగ్రిమెంట్లు లేకపోవడం వల్ల అధికారులు సైతం ఏమీ చేయలేకపోతున్నారు. రైతులకు నష్టాలు రాకుండా ఉండాలనే ఉద్దేశంతో మొక్కజొన్న పంట వేసే రైతులంతా లిఖితపూర్వకంగా ఒప్పందాలు కుదుర్చుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు. మండలంలో ఇప్పటికీ అరువందల ఎకరాలలో మాత్రమే రబీలో వరిపంట వేశారు.మరో వెయ్యి ఎకరాలలో ఈపంట వేసే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. రబీలో మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరిగిందని అధికారులు తెలిపారు.

ఉక్కు సంకల్పంతో ఎన్డీఏ ప్రభుత్వం

విశాలాంధ్ర -భీమవరం: ఉక్కు సంకల్పంతో ఎన్డీఏ ప్రభుత్వం పని చేస్తుందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. గురువారం ఆయన భీమ వరంలో మీడి యాతో మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం ఆంధ్రుల మనోభావాలను గౌరవిస్తూ విశాఖ ఉక్కు కర్మాగారంకు నేటి వరకు 13 వేల 90 కోట్ల నిధులను అందించి కష్టాల్లోని పరిశ్రమకు ఊపిరి పోసిన ఘనత భారత ప్రధాని నరేంద్ర మోడీకే దక్కిందని స్పష్టం చేశారు. ఆంధ్రులకు అండగా ఎన్డీయే ప్రభు త్వం నిలిచిందని,ఆర్థిక సంక్షోభంతో కూరుకు పోయిన విశాఖ స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణకు మంత్రులు కుమార స్వామి, నిర్మలా సీతా

రామన్‌లు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్, పురంధరేశ్వరి వంటి అనేక మంది సమన్వయ కార్యాచరణతో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ ఆలోచనలను రూపుమాపే దిశగా నడిపేందుకు తామంతా ఉక్కు సంకల్పంతో ఉన్నామని ఆయన ఉద్ఘాటించారు.

పల్లె సుబ్బలక్ష్మి మృతికి సంతాపం

విశాలాంధ్ర కామవరపుకోట: ప్రజానాట్య మండలి ఏలూరు జిల్లా నాయకుడు, గాయ కుడు పల్లె నారాయణ మాతృమూర్తి సుబ్బలక్ష్మి మృతికి ఏపీ ప్రజానాట్యమండలి సీనియర్ బుర్రకథ కళాకారుడు సబ్బి కనక రావు, ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ టీవీఎస్ రాజు ప్రగాఢ సంతాపం తెలిపారు. నేటి సమాజంలో ప్రజలను కళల ద్వారా చైతన్యవంతం చేయడానికి ప్రజా గాయకుడు పల్లె నారాయణ లాంటి కళా సైనికునికి జన్మనిచ్చిన ఆ మహాతల్లి పల్లె సుబ్బలక్ష్మి మృతికి ప్రముఖ బుర్రకథ కళాకారుడు వీరమల్ల సత్యనారాయణ కళాకారుల సంఘ అధ్యక్షుడు ఎల్ ఆర్ కృష్ణ బాబు తదితరులు సంతాపం తెలుపుతూ ఆ కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు

ప్లాస్టిక్ రహిత పట్టణంగా పాలకొల్లును తీర్చిదిద్దుతాం : మున్సిపల్ కమిషనర్

విశాలాంధ్ర - పాలకొల్లు : పాలకొల్లు పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని పాలకొల్లు మున్సిపల్ కమిషనర్ బి.విజయ సారధి అన్నారు. గురువారం స్థానిక పురపాలక సంఘ

కార్యాలయంలో పురపాలక సంఘంలోని అన్ని శాఖలకు చెందిన ఉద్యోగులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని దుకాణాలు, హోటళ్లలో వినియోగిస్తున్న ప్లాస్టిక్ టీ గ్లాసులు, ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ పేపర్లు, వినియోగంపై నిఘా ఉంచాలని అన్నారు. 20 మైక్రాన్ల కంటే తక్కువమందం కలిగిన ప్లాస్టిక్ వస్తువులను వినియోగించకుండా నిరోధించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారులు, శానిటరీ అధికారులు, సచివాలయాల కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరణపై తక్షణ చర్యలు తీసుకోవాలి

ఏఐటీయూసీ డిమాండ్

విశాలాంధ్ర- తాడేపల్లిగూడెం : భవననిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరణకు తక్షణచర్యలు తీసుకోవాలని, వెల్ఫేర్ బోర్డు లోని వివిధ సంక్షేమ కార్యకలాపాలను వెంటనే ప్రారంభించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ డిమాండ్ చేశారు.

పశ్చిమగోదావరి జిల్లా భవననిర్మాణ కార్మికసంఘం జిల్లా కార్యవర్గ విస్తృత సమావేశం గురువారం సిపాయిపేటలోని యూనియన్ కార్యాలయంలో జరిగింది. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు బొల్లాడ నాగరాజు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ భవననిర్మాణ కార్మికులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరణపై వెంటనే చర్యలు తీసుకుంటుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. లేనిపక్షంలో యూనియన్ ఆధ్వర్యంలో పోరాడతామని స్పష్టం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు యాభైలక్షల మంది కార్మికులు భవన నిర్మాణ రంగంలో ఉన్నారని, అందులో 22 లక్షల మంది వెల్ఫేర్ బోర్డులో సభ్యులుగా ఉన్నారని, గత ప్రభుత్వ నిర్వాకం కారణంగా బోర్డు నిర్వీర్యం అయ్యిందని అన్నారు. ఎన్నికల ముందు తమ యూనియన్ రాష్ట్ర నాయకులు కూటమి ముఖ్య నేతలను కలిసి కార్మిక సమస్యలను వారి దృష్టిలో పెట్టగా అధికారంలోకి రాగానే వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరణ జరుగుతుందని హామీ ఇచ్చారని డి.సోమసుందర్ గుర్తు చేశారు. బోర్డు విషయంలో ప్రభుత్వ నేతలు సానుకూలంగా స్పందించారని , ఆ దిశగా చర్యలు తీసుకోలేదని , దానిపై కార్మికులు ఆందోళన చెందుతున్నారని సోమసుందర్ అన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు గడిచినా సమస్య పరిష్కారం దిశగా అడుగు ముందుకు పడలేదని అన్నారు. బోర్డు పథకాల అధ్యయనం కోసం మాజీ ఐఎఎస్ అధికారులతో కమిటీ వేస్తానని కార్మికమంత్రి హామీ ఇచ్చి కూడా మూడు నెలలు అయ్యిందని, ఆ కమిటీ కూడా ఏర్పాటు కాలేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరణ దిశగా తక్షణ చర్యలు తీసుకోవాలని డి. సోమసుందర్ డిమాండ్ చేశారు. భవననిర్మాణ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ యూనియన్ కార్యకలాపాలపై కార్యదర్శి నివేదిక ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరణ కోసం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లాలో, రాష్ట్రంలో జరిగిన ప్రయత్నాలను , ఉద్యమాలను వివరించారు. . వెల్ఫేర్ బోర్డు సమస్యను శాసనసభలో లేవనెత్తిన ఎమ్మెల్యేలు ఆరిమిల్లి రాధాకృష్ణ , బొలిశెట్టి శ్రీనివాస్ కు కృతజ్ఞతలు చెప్పారు.

ఏఐటీయూసీ ఏరియా కమిటీ అధ్యక్షుడు ఓసూరి వీర్రాజు మాట్లాడుతూ భవననిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉన్నందున ఓపికగా ఎదురు చూస్తున్నామని అన్నారు. ఇంకా ఆలస్యం అయితే పోరాడటం తప్ప వేరే దారిలేదని, దీనిపై కార్మికులు పట్టుదలతో ఉన్నారని చెప్పారు.

ఏరియా కార్యదర్శి మందలపర్తి హరీష్ మాట్లాడుతూ వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరణ తోపాటు కార్మికుల మిగిలిన సమస్యల పరిష్కారం కోరుతూ త్వరలో ఏఐటీయూసీ చేపట్టనున్న ఉద్యమాన్ని విజయవంతం చేయాలని కోరారు. తాడేపల్లిగూడెం ఏరియా భవన నిర్మాణ కార్మికసంఘం అధ్యక్షుడు దువ్వా శ్రీను మాట్లాడుతూ వెల్ఫేర్ బోర్డు సమస్యపై పోరాడటం తప్పదని, దాంతోపాటు పెద్ద మేస్త్రీలు తమవద్ద పనిచేస్తున్న కార్మికుల భద్రత చూడాలని, కార్మికులకు ప్రమాద బీమా చేయించాలని కోరారు.

జిల్లా యూనియన్ ఉపాధ్యక్షులు అంకం భాస్కరరావు, జిల్లా సహాయ కార్యదర్శి మెండెం జేమ్స్, ఏరియా కమిటీ కార్య నిర్వాహక అధ్యక్షులు పడాల శ్రీనివాస్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి, మైలవరపు శ్రీరామ్ బాబు (నాని) , జిల్లా కోశాధికారి ఏడిద గోపాలకృష్ణ. జిల్లా కార్యవర్గ సభ్యులు కోడె సాయిబాలాజీ, చొప్పా వెంకటేశ్వరరావు, ఈమని దుర్గారావు పిల్లంగోళ్ళ కృష్ణ, తాతకుంట్ల శ్రీనివాస్ గోపిరెడ్డి నరేష్ , పిప్పళ్ళ వెంకట ప్రకాష్ బాబు, బళ్ల శ్రీనివాస్, గంధం సత్యనారాయణ, కంకిపాటి రాజు, సిరిగినీడి నాగేశ్వరరావు .సబ్బవరపు నారాయణరావు , వంగా రాధాకృష్ణ, సానుమిల్లి ఫల్గుణరావు , జానపాముల వెంకట దానయ్య, తదితరులు సమావేశంలో మాట్లాడారు. జిల్లా నలుమూలల నుండి గ్రామ, పట్టణ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఘనంగా గో కార్ట్ పోటీలు

విశాలాంధ్ర -భీమవరం: ఆటోమొబైల్ రంగంలో చోటు చేసుకుంటున్న వినూత్న మార్పులకు గో - కార్ట్ పోటీలు మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థుల్లో నూతన ఆలోచనలు అధ్యయనం చేసేందుకు ఎంతగానో దోహదపడతాయని పలువురు నిపుణులు పేర్కొన్నారు. ఎస్.ఆర్.కె.ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నాలుగు రోజులపాటు జాతీయస్థాయిలో జరిగే 'ఎస్.ఆర్.కె.ఆర్ గో- కార్ట్' ఛాంపియన్ షిప్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. పోటీలను వర్చువల్ విధానంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. జగపతి రాజు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మెకానికల్ ఇంజనీరింగ్ హెడ్ డాక్టర్ కె.సురేష్ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ జగపతి రాజు మాట్లాడుతూ ప్రపంచ ప్రగతికి ఇంజనీరింగ్ కోర్ గ్రూపులైన మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్ వంటి బ్రాంచ్ లు చాలా అవసరమని విద్యార్థి లోకం దీనిని గమనించాలని ఆయన నొక్కి చెప్పారు. నూతన విద్యా విధానంలో చదువులకే కాకుండా ప్రాక్టికల్స్ లో కూడా అనుభవం సంపాదించాలని ఏఐసిటిఈ సూచిస్తుందని, అందుకు అనుగుణంగా ఇటువంటి పోటీలలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. అప్పటికప్పుడు నూతన టెక్నాలజీని అన్వయించుకుని వెహికల్ డిజైన్ అండ్ డెవలప్ చేసి విజయాలు సాధించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షులు ఎస్వి రంగరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి. మురళీకృష్ణం రాజు, కోఆర్డినేటర్ వి.వి.మురళీకృష్ణం రాజు, హిందుస్థాన్ మోటార్ స్పోర్ట్స్ ప్రతినిధి సాగర్ వ్యాస్ తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : పశు ఆరోగ్య శిబిరాలు కార్యక్రమాలలో భాగంగా మండ లంలో గవరవరం గ్రామంలో రైతు సేవా కేంద్రం వద్ద 6 ఆవులకు, 19 గేదె లకు, 102 దూడ లకు, నట్టల నివారణ మందులు అందజేసినట్టు పశు వైద్యాధికారి బి.ఆర్. శ్రీనివాసన్ తెలిపారు. ఈ శిబిరంలో 7 గర్భకోశ చికిత్సలు, 300 మేకలు, గొర్రెలకు, పాస్ వ్యాక్సిన్ వేసి , నట్టల మందు త్రాగించినట్టు తెలిపారు. కొక్కెర తెగులు రాకుండా 398 కోళ్లకు టీకాలు వేసినట్టు శ్రీనివాసన్ పేర్కొన్నారు. ఆరోగ్య శిబిరాన్ని టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు యాగంటి హరిబాబు, గోపిన గోపాలకృష్ణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర-టి నరసాపురం: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని మాజీ జడ్పీటీసీ సభ్యులు నల్లూరి వెంకట చలపతిరావు అన్నారు. చిన్న గుర్వాయిగూడెం ఎంపీపీ పాఠశాల, టి నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో రాష్ట్ర ఐటి,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పుట్టిన రోజు వేడుకలు చలపతిరావు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు.ముందుగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.చిన్న గుర్వాయి గూడెం ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు పెన్నులు,పుస్తకాలు పంపిణీ చేసి పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా విద్యనభ్యసించి ఉత్తమ ఫలితాలు సాధించాలి అన్నారు. 10వ తరగతి విద్యార్థులను ప్రోత్సహించడానికి పబ్లిక్ పరీక్షల్లో మండలంలో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థికి 20వేల రూపాయలు,రెండవ ర్యాంక్ సాధించిన విద్యార్థికి 10వేల రూపాయలు నగదు ఇస్తానని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పిన్నమనేని మధు, పవన్, దావులూరి కృష్ణ, కొండపల్లి రవి, బలుసు రవి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ మహేష్ ఆధ్వర్యంలో లోకేష్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర -ఏలూరు : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఎంపీ మహేష్ ఆదేశాల మేరకు కూటమి నాయకులు, ఎంపీ కార్యాలయం సిబ్బంది మొదట ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రోగులు, సిబ్బందికి పండ్లు పంపిణీ చేశారు. అనంతరం కైకలూరు రోడ్డులోని ప్రేమాలయం వృద్ధాశ్రమంలో వృద్ధుల సమక్షంలో కూటమి నాయకులు కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం ప్రేమాలయంలోని వృద్ధు లకు భోజన వసతి కల్పించారు. నాయకులు, ఎంపీ కార్యాలయం సిబ్బంది వృద్ధులకు దగ్గరుండి భోజనం వడ్డించారు. కార్యక్రమంలో నాయకులు నందిగం సీతారామ్ తిలక్ (బాబి), కాట్రు బాలకృష్ణ (బాలు), వీర్ల ప్రతాప్, ఆలూరి రమేష్, మన్నె అశోక్ గజపతి రాజు, కిలారపు జగదీష్, శాఖమూడి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

గాదిరాజు కుటుంబ సభ్యులకు పరామర్శ

విశాలాంధ్ర -భీమవరం: పితృ వియోగంతో బాధపడుతున్న డీఎన్నార్ విద్యా సంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ గాదిరాజు బాబు కుటుంబ సభ్యులను మాజీ ఎంపీ, టిటిడి మాజీ ఛైర్మన్ కనుమూరి బాపిరాజు దంపతులు గురు వారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన గాదిరాజు సోమరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. మాజీ మంత్రి ఇందుకూరు రామకృష్ణంరాజు, డాక్టర్ గోవింద బాబు, రాయపల్లి వెంకట్ తదితరులు గాది రాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నేతాజీ మహోన్నత వ్యక్తి

విశాలాంధ్ర - గణపవరం: నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్వతంత్ర పోరాటానికి ఒక దిక్సూచిలా పనిచేశారని రుద్రరాజు ఫౌండేషన్ ఛైర్మన్, వర్తక సంఘం అధ్యక్షులు రుద్రరాజు వేంకట సూర్యనారా యణ రాజు (ఆర్‌విఎస్‌రాజు) అన్నారు. గురు వారం గణపవరంలో 128వ నేతాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. శ్రీ స్వామి వివేకానంద సేవా సంఘం, రుద్రరాజు ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గణపవరం 11వ వార్డు స్కూల్లో నేతాజీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హైదరాబాద్‌కు చెందిన కెప్టెన్ కెవి వర్మ విచ్చేశారు. స్కూల్ విద్యార్థులు, హెచ్‌ఎం టి.లక్ష్మి సుగుణ, బి.సుశ్రేష్ట తదితరులు పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నేతాజీ చంద్రబోస్

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : ధీరోదాత్తమైన పోరాటంతో దేశ ప్రజల గుండెల్లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిరస్థాయిగా నిలిచిపోయారని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఏలూరు పవర్ పేటలోని బోసు శిబిరం వద్ద గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బడేటి చంటి నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1945లో తన పాదస్పర్శ ద్వారా సుభాష్ చంద్రబోస్ పునీతం చేసిన ప్రదేశంలో 1947లో బోసు శిబిరం ఏర్పాటు చేసి ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్న కమిటి సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో నేతాజీ చూపిన పోరాటపటిమ ఎంతో ఆదర్శ నీయమన్నారు.

ఆర్టీసి విజయవాడ జోన్ - 2 ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు స్వామీ వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించిన అనంతరం బోసు శిబిరం కమిటి సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కో - ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, ఎస్సెమ్మార్ పెదబాబు, బోసు శిబిరం పరిరక్షణ కమిటి ఛైర్మన్ అల్లు ఉమామహేశ్వరరావు, బోసు శిబిరం కమిటి అధ్యక్షులు పొలిపిరెడ్డి నాగేశ్వరరావు, కార్యదర్శి ములగాల నాగరాజు, కోశాధికారి అల్లు వెంకట పవన్ కుమార్, ఉపాధ్యక్షులు కొత్తల పూర్ణచంద్రరావు, గుడిదేశి శ్రీనివాస్, గౌడ రంగబాబు, బొరోతు బాలాజీ, టిడిపి నాయకులు ఆర్నేపల్లి తిరుపతి, బొద్దాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు

విశాలాంధ్ర-ప్రత్తిపాడు : మండలంలోని గ్రామ సచివాలయ కార్యదర్శులకు గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి లభించింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గ్రేడ్-5 కార్యదర్శులకు, పంచాయతీ గ్రేడ్-4 కార్య దర్శులుగా పదోన్నతులు కల్పించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా మండలంలో ఇద్దరు గ్రామ సచివాలయ గ్రేడ్-5 కార్యదర్శులు ఉండగా వారిలో నియోజవర్గ కేంద్రమైన ప్రత్తిపాడు నుండి పక్కుర్తి శ్రీనివాసరావు, పోతులూరు వాకపల్లి నుండి లొండ గంగాధర్ లకు ఈ పదోన్నతి లభించింది. ఈ పదోన్నతి పొందిన కార్యదర్శులకు, ఎంపీడీవో, ఈవోపీఆర్డీ, తోటి గ్రామ పంచాయితీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది, సర్పంచులు, ఎంపీటీసీలు అభినందనలు తెలిపారు.

ఏఈఇ డీఈనీ సస్పెండ్ చేయాలి

ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ డిమాండ్

విశాలాంధ్ర - అమలాపురం : అల్లవరం మండలం గోడి గ్రామం కొత్త కాలనీలో విద్యుత్ ఘాతుకానికి గురై చిరంజీవి లాస్య చేతిని కోల్పోవడం, తల్లి తీవ్ర గాయాలు పాలవడం చాలా దురదృష్టకరమని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. ఈ సంఘటనకు ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ పూర్తి నిర్లక్ష్యం కారణం అని, గతంలో అనేక పర్యాయ ములు విద్యుత్ వైర్లు కిందకి వేలాడుతున్నాయని విద్యుత్ అధికారుల కుస్తంభాలు మార్చ మని ఫిర్యాదులు చేసిన పట్టించుకోలేదని ఆ నిర్లక్ష్యం కారణం గానే చిన్నారి వికలాంగురాలుగా మారటం జరిగిందని దీనికి తక్షణమే అల్లవరం ఎలక్ట్రికల్ ఏఈని, డిఈని సస్పెండ్ చేయాలని ఇజ్రాయిల్ డిమాండ్ చేసారు. అదేవిధంగా చేతిని కోల్పోయిన చిన్నారి లాస్యకు నష్ట పరిహారం ఇచ్చి ప్రభుత్వం వారి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేసారు. ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ కొత్త కాలనీలో వేలాడుతున్న వైర్లను విద్యుత్ స్తంభాలను మార్చాలని ఆయన కోరారు. గాయాలు పాలైన కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ పరామర్శించారు. కార్యక్రమంలో రేవు శ్రీనివాసరావు, కుక్కల అర్జున్ రావు మొదలగువారు పాల్గొన్నారు.

దివ్యాంగ పింఛన్ల తనిఖీ

విశాలాంధ్ర-ఆలమూ రు: మండలంలోని వివిధ గ్రామాల్లో గురు వారం దివ్యాంగుల పిం ఛన్ల తనిఖీ జరిగింది. రాష్ట్ర ప్రభు త్వం నుంచి రూ. 15 వేలు పొందుతున్న 32 మందిని ఇంటికి తిరుగుతూ ప్రత్యేక వైద్య బృందం సందర్శించింది. చొప్పెల్ల, పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డి సువర్లలాదేవి, డి సాయి కిషోర్ నేతృత్వ ంలో ప్రత్యేక వైద్య బృంద సభ్యులు ఎన్ అశోక్, సీటీవీ సారధి తదిత రులు దివ్యాంగుల వికలాంగ ఖచ్చితత్వాన్ని పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. పెదపళ్ల పీహెచ్సీ పరిధిలో 11మంది దివ్యాం గులకు గాను 10 మందికి, చొప్పెల్ల పీహెచ్సీ పరిధిలో 22 మందికి గాను 12 మందికి పరీక్షలు నిర్వహిం చారు. మిగిలిన దివ్యాంగులకు 27న వికలాంగ పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్య బృందం తెలిపింది.

ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - ఆలమూరు : మండలంలోని కలవచర్ల గ్రామ ంలో పంచాయతీ కార్యలయం వద్ద గురువారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వ హిం చారు. ఓఎన్జిసి రాజమండ్రి అసెట్ వారి సహకారంతో అనుగ్రహ దృష్టిదాన్ సమస్త (ఢిల్లీ) ఆధ్వర్యంలో వేమగిరి దివైన్ ఐ ఫౌండేషన్, పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన ఈ కంటి వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ వడ్డి వెంకన్న, ఓఎన్జీసీ సిబ్బంది కలిసి ప్రారంభించారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో 255 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచి తంగా 125 కళ్ళజోళ్ళు, మందులు, ఐ డ్రాప్స్ అందజేశారు. 30 మంది రోగులను కంటి ఆపరేషన్స్‌కు ఎంపిక చేసి ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి బస్‌లో తరలించారు. గ్రామీణ ప్రాంతాల్లో కంటి వైద్య శిబి రాలు నిర్వహించి, పేదలకు వైద్యసేవలు అందిస్తున్న ఓఎన్జిసి బృం దాన్ని స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో బి ఆదిత్యా, పాల్ సింగ్, చిఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ సంజయ్, ఎన్ చంటిబాబు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి విజయానికి కృషి : ఎమ్మెల్యే జ్యోతుల

విశాలాంధ్ర - జగ్గంపేట : ఉభయ గోదావరి పట్ట భద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చెయ్యాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ఎమ్మెల్సీ వేపాడ చిరం జీవి రావు, కోరారు. స్థానిక నియోజకవర్గ టీడీపీ పార్టీ కార్యాలయంలో టిటిడి కాకినాడ లో జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ అధ్యక్ష తన జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలపై ముఖ్య నాయ కులతో సమావేశం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్సీ ఎన్నికలకు బూత్ ఇన్‌ఛార్జులను నియమించి వారికి బాధ్యతల అప్పగించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నానని మీ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి నన్ను గెలిపిస్తే మీ సమస్యల పరిష్కారం కోసం ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండ బాబు, టీడీపీ నాయకులు కోర్పు లచ్చయ్య దొర, ఎస్వీఎస్ అప్పలరాజు, బిజెపి ఇన్‌ఛార్జ్ దాట్ల కృష్ణ వర్మ, తోట గాంధీ, మారిసెట్టి భద్రం, తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో "రక్తదాన శిబిరం"

విశాలాంధ్ర - గండేపల్లి : స్థానిక ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం కళాశాల ఎన్ఎస్ఎస్. విభాగం, ఎన్‌సీసీ, ప్రగతి మెకానికల్, డేటా సైన్స్ & ఐటీ & సైబర్ సెక్యూరిటీ ఇంజనీరింగ్ సంయుక్తంగా రక్తదాన శిబిరం నిర్వ హించారు. గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ రాజమండ్రి విభా గం ఆఫీసర్ డా సుజాత వారి పర్యవేక్షణలో ఈ కార్యక్ర మం కొనసాగింది. ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డా పి కృష్ణారావు మాట్లాడుతూ, తమ కళాశాల ఎన్ఎస్ఎస్ విభా గం, ప్రగతి మెకానికల్, డేటా సైన్స్, ఐటీ & సైబర్ సెక్యూరిటీ ఇంజనీరింగ్ నిర్వహిస్తున్న రక్తదాన శిబిరానికి గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ రాజమండ్రి వారు అందిస్తున్న సహకారా నికి కృతజ్ఞతలు తెలియజేస్తూ భవిష్యత్తులో చేపట్టే వివిధ సామాజిక కార్యక్రమాలకు తమ వంతు సహాయం అందిస్తా మని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వైద్య బృందం 100 మంది విద్యార్థులకు, అధ్యాపకులకు, సిబ్బందికి ప్రాథ మిక పరీక్షలు నిర్వహించి 70 మంది నుండి రక్తమును సేకరి ంచారు. సహాయ సహకారాలు అందిస్తున్న కళాశాల మేనేజ్ మెంట్‌కు, సిబ్బందికి, సేవా కార్యక్రమాలలో పాల్గొం టున్న విద్యార్థులకు, రక్తదానం చేసిన వారికి గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ స్టాఫ్ రాజమండ్రి వారు కృతజ్ఞతలు తెలిపారు.

గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై అవగాహన

విశాలాంధ్ర - కరప : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు గురువారం మండల విద్యాశాఖ అధికారులు కేబి కృష్ణవేణి, పి సత్యనారాయణ ఆధ్వర్య ంలో బాలల లైంగిక వేధింపులు పై గుడ్ టచ్ బ్యాడ్ టచ్ కార్యక్రమం కరప మండల ంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీస్ సిబ్బంది వారికి అవగాహన కల్పించుట జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓ కృష్ణవేణి మాట్లాడుతూ బడికి వెళ్తున్న బాలలు లైంగిక వేధింపులకు గురికా కుండా ఉండేందుకు ప్రైవేట్ శరీర భాగాలు, భద్రతా నియమాలు, సురక్షితమైన స్పర్శ, అసు రక్షిత స్పర్శ వాటిపై శిక్షణ ఇవ్వడం జరిగింది. 12 సంవత్సరాల లోపు బాల బాలికలకు వేధింపుల నుంచి రక్షించుకునేందుకు ప్రభుత్వం 1098 నెంబర్‌కు ఫోన్ చేసి రక్షణ పొందవచ్చు అన్నారు. పిల్లల్లో భయం లేకుండా నమ్మక స్తులతో చెప్పుకునే విధంగా పిల్లలకు తెలియజేయాలన్నారు. గుడ్డు టచ్ బ్యాడ్ టచ్ ఏ విధంగా ఉంటుందో పిల్లలకు తెలియజేయాలని శిక్షణ సిబ్బందికి తెలిపారు. ఇంటర్నెట్ పట్ల, సెల్ ఫోన్స్ వాడకం పైన తగు జాగ్రత్తలు తీసుకోవాలని పిల్లలకు మంచి విద్యను అందించడం, అపరిచిత వ్యక్తులకు దూరంగా ఉండటం పరిస్థితు లకు అనుకూలంగా వ్యవహరించడం వాటిపై శిక్షణ అందించటం జరిగిందన్నారు.

ఘనంగా లోకేష్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - తాళ్ళరేవు : తాళ్ళరేవు మండలం పోలేకుర్రు పంచాయతీ తోటపేటలో సీనియర్ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు రేవు గోవరాజు, జనిపల్లి ఈశ్వరరావుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ (బాబి) కట్ చేశారు. అనంతరం మహిళలకు చీరలు, మగవారికి తువాళ్ళు అందజేశారు. ఈకార్యక్రమంలో సాధనాల వెంకట శివ రామ కృష్ణ, పోతుల విజయ్ భాస్కర్, సాధనాల మురళి, పోలినాటి శుభాష్, పినిపే నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు. అనంతరం పి మల్లవరం గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను సీనియర్ నాయకులు వుంగ్రాల వెంకటేశ్వరరావు, ధూళిపూడి రామకృష్ణ ఆధ్వర్యంలో కట్ చేశారు. ఈ కార్యక్రమంలో దున్న సుబ్రహ్మణ్యం, పితాని విష్ణు, రాయుడు సింహచలం, దడాల సత్తికొండ, బళ్ళ చిరంజీవి, నేతల నాగార్జున, పురుషోత్తం, ఎన్నం శ్రీను, ఆనాల పాపారావు తదితరులు పాల్గొన్నారు.

నూతన సిమెంట్ రోడ్డు ప్రారంభం

విశాలాంధ్ర - రావులపాలెం : రావులపాలెం మండలం పొడగట్లపల్లి గ్రామంలో రామాలయం ఏరియానందు రూ.15 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన సిమె ంట్ రోడ్డు మరియు డ్రెయిన్‌ను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, గుత్తుల రాంబాబు, చిలువూరి సతీష్ రాజు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెటర్నరీ ఏడీగా చెన్నకేశవులు బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర-గోపాల పురం : రైతుల పశు సంపదను కాపాడేం దుకు అధికా రులు చిత్తశుద్ధితో పనిచేయాలని గోపాల పురం ఏడీగా బాధ్యతలు స్వీకరించిన చెన్నకేశవులు తెలిపారు. గురువారం స్థానిక పశు వైద్యశాల ఏడి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం విలేకరులతో మాట్లా డారు. ఈయన నెల్లూరు జిల్లా కందుకూరు మండలం నుండి పదోన్నతితో బదిలీపై గోపాల పురం వచ్చినట్లు ఆయన తెలిపారు. ఆయనను వెటర్నరీ డాక్టర్లు ఎం. ధరణ్ బాబు, తాళ్లపూడి మండలం వెటర్నరీ డాక్టర్ బాలాజీ శేఖర్, సిబ్బంది సోమేశ్వరరావు, రాటాలు, మండలంలోని ఏహెచ్‌ఏలు మర్యాద పూర్వకంగా తెలిసి శాలువాతో సన్మానించి అభినంద నలు తెలిపారు.

ఏటీఎం కార్డు మార్చి... నగదు చోరీ

విశాలాంధ్ర - కడియం : ఏటీఎంలో డబ్బులు తీసుకోవడా నికి వచ్చిన మహిళను ఒక గుర్తు తెలియని వ్యక్తి మాటలలో పెట్టి, ఏటీఎం కార్డు మార్చి, డబ్బులు విత్ డ్రా చేసి, దొంగిలించిన సంఘటన కడియంలో చోటు చేసు కుంది. కడియం ఎస్ఐ బి నాగ దుర్గా ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం, కడియం మండలం, వేమగిరి గ్రామం జక్కంపూడి నగర్‌కు చెందిన మేడిశెట్టి రజిత అనే మహిళ సోమవారం ఉదయం 11:30 గంటల సమయంలో కడియం దేవి సెంటర్లో గల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ఏటీఎంకు వెళ్లింది. అక్కడ ఒక గుర్తు తెలియని వ్యక్తి ఆమెను మాటల్లో పెట్టి, ఆమె ఏటీఎం కార్డు మార్చేసి, వేరే ఏటీఎం కార్డు ఆమెకి ఇచ్చాడు. అనంతరం ఆమె ఏటీఎం కార్డు నుండి ముప్పై వేల రూపాయలు విత్ డ్రా చేసినట్లు రజిత కడియం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగ దుర్గా ప్రసాద్ తెలిపారు.

ఐక్యతతోనే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించుకోవాలి

విశాలాంధ్ర-కొవ్వూరు : ఐక్యతతోనే ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించుకోగలమని ప్రభుత్వ ఉద్యో గుల సంఘం తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు పి గిరి ప్రసాద్ వర్మ అన్నారు. గురువారం కొవ్వూరు పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణమండపం నందు ప్రభుత్వ ఉద్యోగుల సర్వసభ్య సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా గిరి ప్రసాద్ వర్మ మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వంలో వివిధ శాఖలలో పని చేస్తున్న ప్రభుత్వ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పడుతున్న సమస్యలను పరిష్క రించడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ముందుండి పోరాడు తుందన్నారు. తూర్పుగోదావరి జిల్లాలోని పదివేల మంది ఉద్యోగులను ప్రత్యక్షంగా కలిసి వారిని చైతన్య పరచడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పనిచేస్తుంద న్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ జి ఇ ఏ తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి సీహెచ్‌ఎస్ విల్సన్, జిల్లా ఉపాధ్య క్షుడు డి చాంబర్లీన్, నాయకులు ఎం దుర్గాప్రసాద్ అమరా వతి కృష్ణ ప్రియా, కమల సుందర్ రాజమండ్రి సిటీ అధ్యక్షులు విజయకుమార్ రాష్ట్ర ఐక్యవేదిక నాయకులు వెంకటరత్నం, వెంకటేశ్వరరావు, తదితర ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల పారిశ్రామిక సందర్శన

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం, సూరంపాలెం ఆదిత్య తృతీయ సంవత్సరం అగ్రి కల్చర్ ఇంజనీరింగ్ విద్యార్థులు, పారిశ్రామిక సందర్శనలో భాగంగా విశాఖ పట్నంలో గల హార్మొనీ ఫుడ్స్ ప్రై లిను సందర్శించారు. ఈ ప్లాంట్‌లో టెక్నికల్ సిబ్బంది ప్లాంట్ యొక్క కెపాసిటీ ఒకరోజుకు 300 టన్నుల ఉత్పత్తి అవుతుంది అనీ అలాగే ప్లాంట్ యొక్క వివిధ దశల పనితీరు గురించి విద్యార్థులకు వివరించారు. సంస్థ టెక్నికల్ డైరెక్టర్ పురుషోత్తం కుమార్ బజాజ్ మాట్లాడుతూ ఈ ప్లాంట్ నందు గోధుమ పిండి, మైదా, దలియా, సుజీ వివిధ యంత్రాలను ఉపయోగించి మిల్లింగ్ ప్రక్రియ ద్వారా జరుగు విధానం గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్ శేషారెడ్డి, యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్. డా ఎన్ సతీష్ రెడ్డి, డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం శ్రీనివాస్ రెడ్డి, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ రమాశ్రీ, అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవి రాజేష్ మరియు విభాగాధిపతి డాక్టర్ కృష్ణ కాంత్ మాట్లాడుతూ ఈ రకమైన పారిశ్రామిక సంద ర్శనలలో విద్యార్థులు తరచూ పాల్గొనడం ద్వారా ప్రత్యక్ష పరిజ్ఞానం పొందడా నికి దోహదపడతాయని అన్నారు. ఫాకల్టీ కో ఆర్డినేటర్‌లుగా డా రెహమాన్, ఆర్ మానస లక్ష్మి దుర్గలు విద్యార్థులకు చక్కటి దిశానిర్దేశం చేశారు.

'అడబాల'కు అభినందనలు

విశాలాంధ్ర - కొత్తపేట : కోనసీమ జిల్లా బిజెపి అధ్యక్షుడిగా ఎన్నికైన అడబాల సత్యనారాయణను కొత్తపేట బిజెపి నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. నూతన అధ్యక్షులు అడబాల సత్య నారాయణ, మాజి ఎమ్ ఎల్ఏ. రాష్ట్ర ఉపాధ్యక్షులు మానేపల్లి అయ్యాజి వేమాను ఘనంగా సన్మానించారు. సత్య నారాయణ మాట్లాడుతూ అందరి సహకారంతో బిజెపినీ గ్రామస్థాయి నుంచి బలో పేతం చేయడానికి కృషి చేయాలని కోరారు. పార్టీలో కొత్తతరం పాతతరం అనే భేదం లేకుండా మీరందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కోటిపల్లి వేంకట సుబ్రహ్మణ్యం, భమిడిపాటి లక్ష్మీనారాయణ, నల్లాశ్రీరామ్ ప్రసాద్, కోటిపల్లి దామోదర్, కుడుపూడి దావీదు రాజు, గోనెమడతల కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా నమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా నా క్లైంటు శ్రీమతి ఇంటి రాజేశ్వరి, W/o. వెంకటరమణ మరియు దేశలింగ సత్య, S/o. వీరబాబు గారికి కత్తిపూడి గ్రామంలో గల డాక్యుమెంట్ నెం: 20781/2024 పంపూకపు వాటాల జాబితా దస్తావేజు పొందియున్నారు. సదరు ఆస్తిని హెరిటేస్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కత్తిపూడి బ్రాంచ్ నందు రుణం తీసుకున్నారు. సదరు ఆస్తికి సంబంధించిన లింక్ డాక్యుమెంట్ ఒరిజినల్ దస్తావేజు 5076/2015 ఈ డాక్యుమెంట్ జిరాక్స్ నిమిత్తం కత్తిపూడి గ్రామ దారి మార్గంలో పడిపోవడం జరిగినది. ఒరిజినల్ లింకు డాక్యుమెంట్ పోయిన దృష్ట్యా ప్రత్యమాయంగా పంపూకు వాటా జాబితా దస్తావేజు 20781/2024 ఒరిజినల్ డాక్యుమెంట్ సదరు, బ్రాంచ్‌కు అవసరమైన అన్ని డాక్యుమెంట్స్ డిపాజిట్ చేస్తున్నాను. కావున ప్రజానీకానికి తెలియ జేయునది ఏమనగా సదరు ఒరిజినల్ డాక్యుమెంట్ కొనుక్కున్న లేదా దొరికిన పైన తెలిపిన నా క్లైంట్ చిరునామాకు వాపసు చేయుగలరు. ఈ డాక్యుమెంట్ వినియోగించిన ఎడల చట్ట రీత్య చర్యలు తీసుకోబడును. కావున ఈ ప్రకటన జారీ చేయడమైనది.

పి.బి. రాముడు, అడ్వకేట్/నోటరీ,
ప్రత్తిపాడు, 9490841978
ప్రత్తిపాడు, తేదీ: 23-1-25

ఇళ్లు నిర్మాణాలు పూర్తి చేయించాలి

విశాలాంధ్ర - జగ్గంపేట : రుణాలు మంజూరైన ఇళ్ళ నిర్మాణాలను త్వరిత గతిన పూర్తి చేయించాలని డిప్యూటీ కలెక్టర్, హౌసింగ్ పీడీ ఎన్‌వివి సత్యనారా యణ అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గృహ నిర్మాణాలపై సమావేశం నిర్వహించారు. జగ్గంపేట, గండే పల్లి, కిర్లంపూడి మండలాల్లో 188 గృహాలు పూర్తి కావాల్సి ఉందని, మార్చి 31వ తేదీ లోపు పూర్తి చేయించాలన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ ఈఈ కెవిఆర్ గుప్తా, హౌసింగ్ డీఈ వేణుగోపాల్, ఏఈఏ గండే పల్లి, జగ్గంపేట, కిర్లంపూడి ఏఈలు, ఏపీవోలు, ఏపీఎంలు, లే ఔట్ స్పెషల్ ఆఫీసర్లు, మూడు మండలాలు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వర్క్ ఇన్స్పెక్టర్లు, పాల్గొన్నారు.

సాగునీరు సక్రమంగా అందించాలి

విశాలాంధ్ర - ఆలమూరు : మండలంలోని చింతలూరు సాగునీటి సంఘం పరిధిలో చివరి భూమికి సైతం సాగు నీరు అందించేందుకు అందరం సమిష్టిగా కృషి చేద్దామని అధ్యక్షుడు గార పాటి శ్రీనివాస్ చౌదరి అన్నారు. జొన్నాడ నుంచి వెదురుమూడి వెళ్ళే కొత్త కాలువ పూడికతీత పనులను గురు వారం ఆయన ప్రారంభించారు. చింత లూరు నుంచి ఒక కిలోమీటరు మేర కూలీలు పూడికను తొలగించారు. దశల వారీగా కాలువ వెంబడి అస్తవ్యస్తంగా ఉన్న వ్యర్థాలను తొలగించి సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటు న్నట్లు శ్రీనివాస్ చౌదరి పేర్కొన్నారు. అనంతరం పెదపళ్లలో ఉచిత పశు వైద్య శిబిరం ఏర్పాటు జరిగింది. వెటర్నరీ ఏడీ అనిత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్యశిబిరంలో చికిత్స చేయించు కున్న పాడి రైతులకు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస్‌చౌదరి, ప్రభుత్వం నిధులతో పశువుల మందులను రైతులకు అందజేసారు.

సోమిత్వా సర్వే విజయవంతం చేయాలి

డీఎల్‌పీ ఓ నాగలత

విశాలాంధ్ర-సీతానగరం: సోమిత్వా సర్వే విజయవంతం చేయాలని జిల్లా పంచాయితీ అధికారి డీఎల్‌పీ ఓ నాగలత అన్నారు. మండలంలో గల సీతానగరం గ్రామ సచివాలయంలో గురువారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. దీనిలో భాగంగా చెత్త సంపదా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ తనిఖీలో భాగంగా పంచాయితీ పరిధిలో పన్ను చెల్లింపులు, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా చేపట్టిన సోమిత్వా సర్వే సచివాలయం సిబ్బంది బాధ్యతా యుతంగా నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఆదేశిం చారు. డీఎల్‌పీ ఓ నాగలత మాట్లాడుతూ సచివాలయం సిబ్బంది తమకు నిర్దేశించిన సర్వే, పన్నుల వసూళ్లును పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే చెత్త నుండి సంపదా కేంద్ర నుండి సంపద సృష్టించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యదర్శి సత్యనారాయణ, సచివాలయం సిబ్బంది, చినబాబు పాల్గొన్నారు.

యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించాలి

విశాలాంధ్ర - యానాం : భారత ప్రభుత్వం యువజన వ్యవహారాల, క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్ర యానం ఆధ్వర్యంలో డా॥ ఎస్ఆర్‌కె ప్రభుత్వ అర్ట్స్ కళాశాల నందు జిల్లాస్థాయి స్పోర్ట్ మీట్ నిర్వహించారు. యువతి యువ కులుకు వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్, సైక్లింగ్ ఆటలు నిర్వహించారు. జిల్లా యువజన అధికారి తిర్రి గోపి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందించడానికి ఈ కార్యక్రమాలు నిర్వ హిస్తున్నట్లు తెలిపారు. విజేతలుకు ఐటీఐ ప్రిన్సిపల్ చింతపల్లి కృష్ణ సుధాకర్, డా॥ ఎస్ఆర్‌కె ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల సూపరీండెంట్ విద్యసాగర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ లత చేతులమీదుగా బహుమతులు, ప్రశంస పాత్రలను అందచే శారు. బ్లాక్ లెవెల్ పోటీల్లో విజేతలకు 6 జట్టులకు స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ చేశారు. వ్యాయామ, ఉపాధ్యాలు కొప్పనాతి రమేష్, నక్కల సుబ్బన్న, చింత రామ కృష్ణ, వడ్డి వరప్రసాద్, పోతుల సోమేష్, ఆనంద్ పాల్గొన్నారు.

సైకిల్ స్టాండ్ వేలం

విశాలాంధ్ర - కరప : చొల్లంగి అమావాస్య తీర్థం ఈనెల 29న జరుగుతున్న సందర్భంగా సైకిల్ స్టాండ్ పెట్టుకునేందుకు ఈనెల 24వ తేదీన చొల్లంగి దేవాలయం వద్ద బహిరంగ వేళమును ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ వేలంలో పాల్గొను పాతదారులు ధారావత్ చెల్లించి పాల్గొనవచ్చునని ఎంపీడీవో ఎం అనుపమ పేర్కొన్నారు. ఈ వేళలను శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఘనంగా నేతాజీ జయంతి

విశాలాంధ్ర - కడియం : కడియం మండలం ముర మండ గ్రామంలో బస్టాండ్ వద్ద నేతాజీ సుభాష్ చంద్ర బోస్ 128వ జయంతి వేడుకలు నిర్వహి ంచారు. నేతాజీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనం తరం మిఠాయిలు పంచారు. రైతు ప్రత్తిపాటి వెంకట్రామయ్య చౌదరి మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య పోరాట ంలో ఎంతో కీలకమైన పాత్ర పోషించిన సుభాష్ చంద్రబోస్ అత్యంత శక్తివం తులని, ఆయన దేశభక్తి ఎనలేనదని, ప్రసిద్ధ విప్లవకారుడుగా కీర్తి గడించారని, ముందుచూపుతో దూరదృష్టితో స్వాతంత్ర ఉద్యమాన్ని ఆయన నిర్వహించారని, తెల్లదొరలు గుండెల్లో రైళ్లు పరిగెట్టించారని అన్నారు. జనవరి 23, 1897లో సంపన్న కుటుంబంలో పుట్టి దేశం కొరకు పాటుపడిన నేతాజీ సుభాష్ చంద్ర బోస్ యొక్క వీర గాథలను భవిష్యత్తు తరాలకు తెలుపడానికి పుట్టినరోజు ప్రతీ ఒక్కరూ జరపాలని అన్నారు. కార్యక్రమంలో కోటిపల్లి లక్ష్మణరావు, వాసం శ్రీనివాస్, అధికారి నాగేశ్వరావు, మిద్దే సుబ్బారావు, పోలేటి వెంకన్న, షేక్ బాసు, గుండుబోగుల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులకు సినర్జీ కంపెనీ ప్లేస్మెంట్

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య విద్యా సంస్థలకు చెందిన ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో బి ఫార్మసీ నాలుగవ సంవత్సరం చదువుతున్న 13 మంది విద్యార్థులు విశాఖపట్నంలో గల సినర్జీ కంపెనీలో ప్లేసెమెంట్ సాధించారని ప్రిన్సిపాల్ డా కె రవి శంకర్ తెలియజేశారు. ఎంపికైన వారికి వార్షిక వేతనం రూ.2.50 లక్షలు అని తెలిపారు. ఉద్యోగాలు పొందిన ఎం కిరణ్ కుమార్, ఎండీ. షాహుల్, జె శివ, పి సత్య ప్రవీణ్, లోకేష్ కుమార్, వి ఊర్మిళ, ముఖేష్ కుమార్, అవినాష్ కుంద్రల్, అనీష్‌శర్మ, అవిజిత్ నాయక్, ఎం ప్రదీప్, సుబాన్కర్ రాయ్, ఎండీ ఇర్షాద్‌కు డా ఎన్ దివ్య, బిఎన్‌బి వైదేహి, బి రాజు, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

గోకులం షెడ్డులను ప్రారంభం

విశాలాంధ్ర-రావులపాలెం : మండలం పొడగట్ల పల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన రైతులకు ఉపయో గకరమైన గోకులం షెడ్డులను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు ప్రారంభించారు. పొడగట్లపల్లి గ్రామంలో సాగివారివీధి, జనిపిరెడ్డి పాలెం, వినాయకపాలెం, సోమాలమ్మ గుడి ఏరియాలలో సాగి లక్ష్మి నరసింహ రాజు, మచ్చా వెంకటేశ్వ రరావు, కొండపర్తి వెంకటేశ్వర్లు, వెట్టి సత్యనారాయణ అను రైతులకు మంజూరైన ఈ గోకులం షెడ్డులను ఎమ్మెల్యే సత్యానంద రావు ప్రారంభించడం జరిగింది. ఆకుల రామకృష్ణ, గుత్తుల రాం బాబు, చిలువూరి సతీష్ రాజు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా నారా లోకేష్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-దేవరపల్లి: ఆంధ్రప్రదేశ్ విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చి భారతదేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను విద్యారంగంలో ఉన్నత స్థితికి తీసుకొచ్చిన ఘనత ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దేనిని దేవరపల్లి మండల టీడీపీ పార్టీ అధ్యక్షుడు అంగ్రు అనిల్ పేర్కొన్నారు. దేవరపల్లి అంబటి సత్యనారాయణరావు జిల్లా పరిషత్ హై స్కూల్లో గురువారం ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హై స్కూల్ ప్రథమ ఉపాధ్యాయిని బి శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో అనిల్ మాట్లాడుతూ చిన్న వయసులోనే మంత్రి పదవి చేపట్టి రాజకీయ రంగంలో అంచెలంచెలుగా ఎదిగి ఐటి విద్యాశాఖ మంత్రిగా ఆంధ్రప్రదేశ్ విద్యారంగంలో అనేక విప్లవత్మకమైన మార్పులు తీసుకుని వచ్చిన మంత్రి నారా లోకేష్ రాష్ట్ర ప్రజల మనలను పొందారన్నారు. విద్యార్థిని విద్యార్థులు మంత్రి నారా లోకేష్ క్రమశిక్షణ పట్టుదలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు సహకారంతో మంత్రి లోకేష్ జన్మదిన వేడుకలు సందర్భంగా దేవరపల్లి మండలంలో అన్ని జిల్లా పరిషత్ హై స్కూల్‌లలో పది విద్యార్థులకు స్కూలు మెటీరియల్ జామెంట్రీ బాక్సు, పెన్నులు పుస్తకాలు అందజేస్తున్నామన్నారు. ఈ సభలో టీడీపీ సీనియర్ నేతలు కే భీమరాజు కొండపల్లి దొరయ్య ఉప్పులూరి రామారావు గద్దె సుబ్రహ్మణ్యం ఎలమాటి అక్కిరాజు, నారా లోకేష్ విశిష్ట గుణాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు యలమాటి అక్కిరాజు తంగేళ్ల మునేశ్వరరావు కొండపల్లి దొరయ్య గద్దె సుబ్రమణ్యం ఉపాధ్యాయులు మాధవరపు లక్ష్మీనారాయణ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : గ్రామాల్లో నిర్వహించే పశు ఆరోగ్య శిబిరాలను పాడి రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కొత్తపల్లి పశు వైద్యాధికారి శ్రీమన్నారాయణ అన్నారు. కొత్తపల్లి మండలంలోని వాకతిప్ప, నాగులపల్లి గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందించారు. పాడి రైతులకు పశువుల ఆరోగ్యం పై తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఈ శిబిరాలు ప్రతి గ్రామంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. పాడి రైతులందరూ ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు పశువులకు ఏ సమస్య ఉన్నా శిబిరాలకు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా లోకేష్ పుట్టిన రోజు వేడుకలు

విశాలాంధ్ర - ఏలేశ్వరం : రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పుట్టిన రోజు వేడుకలను మండల టిడిపి నేతలు గురు వారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ 43వ పుట్టిన రోజు సందర్భంగా పెద్దనాపల్లిలోని ఎంపీపీల సంక్షేమ సంఘం అధ్యక్షులు, స్థానిక ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ఆధ్వర్యంలో టిడిపి నేతల సమక్షంలో పెద్ద కేక్‌ను కట్ చేసి సంబరాలు చేపట్టారు. అలాగే ఏలేశ్వరం పట్టణంలోని పట్టణ అధ్యక్షుడు మూది నారాయణస్వామి, కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి ఆధ్వర్యంలో లోకేష్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించి అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండు రొట్టెలను పంపిణీ చేశారు. మండలంలోని వివిధ ప్రాంతాలలో లోకేష్ పుట్టినరోజు వేడుకలు అంబరాన్నంటాయి.

విద్యార్థుల భవిష్యత్తుకు నారా లోకేష్ కృషి

విశాలాంధ్ర - గోపాలపురం : రాష్ట్రంలోని విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు రాష్ట్ర విద్యాశాఖ, ఐటి మంత్రి నారా లోకేష్ ఎంత గానో కృషి చేస్తున్నారని టీడీపీ పార్టీ కార్యదర్శి వల్ల మూడి రమేష్ బాబు తెలిపారు. గురు వారం మండలంలోని వాదాలకుంట జిల్లా పరిషత్ హై స్కూల్ నందు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని పదో తరగతి విద్యార్థిని విద్యార్థులకు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు ఆధ్వర్యంలో జామెంట్రీ బాక్స్, ప్యాడ్, పెన్ వంటి పరీక్షల మెటీరియల్‌ను అందించారు. రమేష్‌బాబు సాంకేతిక పరిజ్ఞానంలో నిపుణుడి అయిన విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆలోచనల మేరకు రాష్ట్రాన్ని ఐటి హబ్‌గా నిలువ పెట్టేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఆయన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ హైస్కూల్, జూనియర్ కళాశాలల్లోని విద్యార్థిని విద్యార్థు లకు మెటీరియల్ అందిస్తున్నట్టు తెలిపారు. మండలంలోని మిగిలిన హై స్కూల్స్ గోపాలపురం, బీమోలు, చిట్యాల, జగన్నాధ పురం కొవ్వూరుపాడు రాజంపాలెం హుకుంపేటలోగల జిల్లా పరిషత్ హై స్కూల్స్ విద్యార్థిని విద్యార్థులకు 658 కిట్లను, గోపాలపురంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 60 మందికి ఈ కిట్లను పరువులు టీడీపీ గ్రామ సర్పంచులు అందించారు. టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు రొంగల సత్యనారాయణ, జస్ట్ శ్రీధర్, జ్యేష్ట శ్రీనివాసరావు జొన్నలగడ్డ ప్రసాద్, కాకర్ల శ్రీరామ్, కాట్రగడ్డ సురేష్, పసుమర్తి పెద్దబ్బులు, పసుమర్తి రాఘవ చౌదరి, గద్దె హరిబాబు, నూతంగి దొరబాబు, ఆయా పాఠశాలల ప్రధానో పాధ్యాయులు ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

సురక్షిత గమ్యస్థానాల లక్ష్యంగా ప్రయాణం సాగాలి

ఎమ్మెల్యేలు బడేటి, చింతమనేని

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు : సురక్షిత గమ్యస్థానాలే లక్ష్యంగా వాహనదారులు ప్రయాణాలు సాగించాలని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి సూచించారు. ఏలూరు జిల్లావ్యాప్తంగా జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 16వ తేదీ నుండి రవాణా శాఖ ఆధ్వర్యంలో వలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. ప్రజల్లో, వాహనదారుల్లో ప్రమాదాల నివారణపై విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. గురువారం ఏలూరులో నిర్వహించిన వాక్‌థాన్ కార్యక్రమంలో ఏలూరు, దెందులూరు ఎమ్మెల్యేలు బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్, నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తొలుత వారికి ఆర్టీవో కృష్ణారావు ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది. అనంతరం స్థానిక ఫైర్‌స్టేషన్ సెంటర్ నుండి జ్యూట్‌మిల్ సెంటర్‌లోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు వాక్‌థాన్ నిర్వహించారు. అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. రోడ్డు భద్రతాంశాల సూచనలతో రూపొందించిన ప్లకార్డులు చేతబట్టిన విద్యార్థులు కూడా భాగస్వాములయ్యారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ వాహనదారులు రోడ్లపై ప్రయాణాలు సాగించేటప్పుడు ప్రమాద హెచ్చరిక సూచికల్ని, నిబంధనల బోర్డుల్ని గమనించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, తద్వారా ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాపాయ పరిస్థితులు ఉత్పన్న కావన్నారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడపడం అత్యంత ప్రమాదకర మన్నారు. ప్రైవేటు రవాణా వాహనాలు పరిమితికి మించి ప్రజా రవాణా చేయకూడదని, ఇది చట్ట విరుద్ధమని హెచ్చరించారు. కార్యక్రమంలో కో - ఆప్షన్ సభ్యులు ఎస్మెమ్మార్ పెదబాబు, నాయకులు ఆర్నేపల్లి తిరుపతి, అమరావతి అశోక్, బొద్దాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ చేతిరాత దినోత్సవం

విశాలాంధ్ర - పిఠాపురం : జాతీయ చేతివ్రాత దినోత్సం సందర్భంగా ఆర్‌ఆర్‌బిహెచ్‌ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి చేతివ్రాత పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో వివిధ పాఠశాల నుండి సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలు మూడు క్యాటగిరిలో జరిగినవి. మూడు నాలుగు ఐదు తరగతులను సబ్ జూనియర్స్ గాను, ఆరు ఏడు తరగతులు జూనియర్స్ గాను, ఎనిమిది తొమ్మిది, పది తరగతులు సీనియర్స్ గాను పరిగణించి ఈ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను జిల్లా విద్యాశాఖ అధికారి పి రమేష్, కాకినాడ డివిజన్ డిప్యూటీఈవో నాయుడు వెంకటేశ్వర్రావు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ పోటీలలో ప్రతి విభాగం నుండి ఫస్ట్ సెకండ్ థర్డ్, ఫోర్త్ ప్లేస్‌ల విజేతలైన విద్యార్థుల పేర్లు ప్రకటించారు. సబ్ జూనియర్స్ విభాగం నుండి బి వెంకట్ ఆర్‌ఆర్‌బిహెచ్ ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పిఠాపురం, ఏ శశికళ-జడ్పీహెచ్‌ఎస్ మల్లం, కే మహాలక్ష్మి మున్సిపల్ హైస్కూల్ సామర్లకోట, ఎస్ జ్యోతి కమల ఎంపీపీ ఎస్ ధర్మవరం గాను, జూనియర్స్ విభాగం నుండి ఎస్. జ్యోతిస జడ్పీ హెచ్ ఎస్ తాళ్లరేవు, ఈ అచ్చారత్నం జడ్పీహెచ్ ఎస్ శంఖవరం. పి సత్య శ్రావణి జడ్పీహెచ్ఎస్, పీ దంతమూరు, వి లక్ష్మీ గంగాదుర్గ జడ్పిహెచ్ఎస్ మల్లం. సీనియర్స్ విభాగం నుంచి ఎం నాగాంజలి మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్ పిఠాపురం. కే సంధ్యా రాణి జడ్పీహెచ్ఎస్, పి దంతమూరు, పి మౌనిక సాయి జెడ్పిహెచ్ఎస్ తుని, బి లిప్సిక జెడ్ పి గర్ల్స్ హైస్కూల్ సామర్లకోట విజేతలుగా నిలిచారు. కార్యక్రమానికి ఎస్ఎంసి కమిటీ చైర్మన్ పల్లా లక్ష్మణరావు విచ్చేసి విజేతలకు బహుమతులు అందించారు. తదుపరి డిఎస్ఓ వినీల్ మాట్లా డుతూ ఒక విద్యార్థి యొక్క చేతిరాత అతని తల రాత మారుస్తుందన్నారు. వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఎస్ఎంసి కమిటీ సభ్యులు ఆర్ఆర్‌బి హెచ్ఆర్ పాఠశాల ఉపాధ్యాయులు ఏసిఏన్ రామకృష్ణ, బి బాలకృష్ణ, బిపిసిహెచ్ కృష్ణ ఫర్, వైరామారావు, బేతా రామస్వామిజి తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర-కాకినాడ : జెఎన్‌టియుకె ప్రాంగణంలో 23 గురువారం ఉదయం 1970-1975 బ్యాచ్ ఈసిఈ విభాగం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. అలూమ్ని ఆడిటోరియం నందు నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ కెవిఎస్‌జి మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరు కాగా గౌరవ అతిథులుగా ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ వి రవీంద్రనాధ్, ఐక్యూఏసి ఇన్‌ఛార్జి డైరెక్టర్ ప్రొ ఎంహెచ్ఎం కృష్ణప్రసాద్, లీగల్ అఫైర్స్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ ప్రొ ఎన్ బాలాజీ, ఈసిఈ విభాగాధిపతి డా బి లీలాకుమారిలు విచ్చేశారు. పూర్వ విద్యార్థులు ఏకె దీక్షిత్ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా కె రాజేశ్వరరావు అతిథు లకు స్వాగతం పలికారు. ఇన్‌ఛార్జి ఉపకుల పతి ప్రొ కెవి ఎస్‌జి మురళీకృష్ణ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న కళాశాల అభివృద్ధికి ఇతోధికంగా సహకరి ంచి మరింత అభివృద్ధి బాటలో పయనింపజేసేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా మాజీ ప్రిన్సిపాల్, ఈసిఈ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ డా కైలాశరావును అతిథులు, పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, విభాగాధిపతులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు మోటివేషన్ సదస్సు

విశాలాంధ్ర - కాకినాడ : స్థానిక సాలి పేట మునిసిపల్ గర్ల్స్ హై స్కూల్‌లో గురువారం ఉదయం 10.30గంల నుండి మధ్యాహ్నము 1.00 గం. వరకు ఎంపిజే, కాకి నాడ జిల్లా అధ్యక్షులు ఎండి హలీమ్ ఆధ్వర్యంలో ఆ పాఠ శాల ప్రధానోపాధ్యాయులు సుబ్బలక్ష్మిఅధ్యక్షతన మార్చ్ 2025 ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షలు రాయు 282 మంది 10వ తరగతి విద్యార్థులకు మోటివేషన్ క్లాసును నిర్వ హించడం జరిగినది. ఈ మోటివేషన్ సదస్సులో నేష నల్ మోటివేటర్ అబ్దుల్ అజీజ్, నారాయణ ఈ టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ షర్మీలా, జయహో సంస్థ ఉపాధ్యక్షులు ఆఖిల్ అలీలు విద్యార్థులను తమదైన శైలిలో ఉత్తేజ పరుస్తూ లక్ష్యాలను చేరుకోవాలని ప్రేరేపించారు. ఎంపిజే అధ్యక్షులు హలీమ్ మాట్లాడుతూ పరీక్షలలో తీసుకోవలసిన జాగ్రత్తలు తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రైవేట్ కాలేజీల డైరెక్టర్ సూర్యనారాయణ విద్యార్థుల వ్యవహార శైలి ఎలా ఉండాలో వివరించారు. ఎంపిజే సభ్యులు అబ్దుల్లా, సాహెరా, తులసి ప్రకాష్, నాయని రాజు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

విశాలాంధ్ర - తాళ్లరేవు : కాకినాడ జిల్లా తాళ్లరేవు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొప్పిశెట్టి లక్ష్మయ్య బ్రహ్మర్పణ్ లయన్స్ ఉచిత అభాగ్యుల భోజన పథకం మొదలై గురువారం నాటికి 754 వ రోజుకు చేరుకుంది గురువారం అన్నదాత తాళ్లరేవు మండలం పి మల్లవరం గ్రామపంచాయతీ వాస్తవ్యులు స్వర్గీయ ఖండవిల్లి సూర్యకాంతం జ్ఞాపకార్థం వారి మనవడు సురేష్, కుటుంబ సభ్యులచే బ్రహ్మర్పణలో అభాగ్యులకు భోజనములు, ఫ్రూట్స్, చలికాలం సందర్భంగా దుప్పట్లు ఏర్పాటు చేయడమైనది. తాళ్లరేవు లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలకు సహకరిస్తున్న ప్రతీ ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేసిన క్లబ్ అధ్యక్షుడు పొన్నాడ పేరయ్య రాజు, లయన్ బిళ్ళకుర్తి శ్రీనివాసరెడ్డి, వెంకటరమణ (బాబి), సతీష్ రాజు, బాలాజీ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం: ఏఐవైఎఫ్

విశాలాంధ్ర-సామర్లకోట: ప్రజా సమస్యలపై ఏఐవైఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని సంఘం జిల్లా కార్యదర్శి వై. బాబి అన్నారు. అఖిల భారత యువజన సమాఖ్య పెద్దాపురం నియోజకవర్గ నాల్గవ మహాసభ సప్ప సూరిబాబు అధ్యక్షతన స్థానిక విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్‌లో గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన బాబీ మాట్లాడుతూ యువజన సంఘం రాష్ట్ర మహాసభలు శ్రీకాకుళం లో ఫిబ్రవరి ఆరో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి అమలుపై భవిష్యత్తు ఉద్యమ కార్యచరణకు ఈ మహాసభలు దోహదపడతాయన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ మాట్లాడుతూ నిరుద్యోగ భృతిపై నిర్వహించే పోరాటంలో యువత కీలకపాత్ర పోషించాలని, ప్రశ్నించే తత్వం అలవాటు చేసుకోవాలని అన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ ఏఐవైఎఫ్ బాధ్యతాయుతమైన సంఘంగా నిరుద్యోగం, నిరక్షరాస్యత, సర్వభౌమ అధికారం, జాతీయ స్వతంత్రం, ఆరోగ్య సౌకర్యాలు తదితర వాటిపై నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. పెద్ది పెద్దిరెట్ల సత్యనారాయణ మాట్లాడుతూ పెద్దాపురం నియోజకవర్గంలో యువతను ప్రోత్సహించేందుకు, అవినీతిని అరికట్టేందుకు, పరిశ్రమలు నెలకొల్పేందుకు, స్థానికులకు ఉపాధి అవకాశం కల్పించేందుకే ఈ మహాసభలు ఉపయోగపడతాయని అన్నారు. నూతన కమిటీ సంఘ గౌరవ అధ్యక్షుడిగా కసింకోట కిషోర్, అధ్యక్షుడిగా సప్ప సూరిబాబు, ఉపాధ్యక్షుడుగా మడగల రమణ, శ్రీమంతుల రాజేశ్, ప్రధాన కార్యదర్శిగా బంగారు సందీప్, సహాయ కార్యదర్శిగా పలివెల సతీశ్, కార్యదర్శిగా హజారి లావరాజు, కోశాధికారిగా బర్రంకి లక్ష్మీనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహాసభల పోస్టల్ ఆవిష్కరించారు.

అంగన్వాడీ కేంద్రాలను కలెక్టర్ పరిశీలన

విశాలాంధ్ర-దేవరపల్లి: తూర్పుగోదావరి జిల్లాలో అన్ని అంగన్వాడి కేంద్రాలకు మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం జరుగుతుందని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి వెల్లడించారు. దేవరపల్లి మండలం దేవరపల్లి చిన్నాయగూడెం యాదవోలు గ్రామాలలో అంగన్వాడి కేంద్రాలను ఆమె పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాలలో టాయిలెట్లు వంటగది తాగునీరు సరఫరా ఏ విధంగా జరుగుతుందో ఆమె పరిశీలించారు. ముఖ్యంగా అంగన్వాడీ కేంద్రాల చుట్టూ ప్రహరీ గోడలు నిర్మాణంను పరిశీలిస్తామన్నారు. విద్యార్థిని విద్యార్థులకు పుస్తకాలను కలెక్టర్ ప్రశాంతి అందజేశారు. దేవరపల్లిలో ఇందిరమ్మ కాలనీలోని పోషణవాటికను పరిశీలించి సేంద్రియ ఎరువుల ద్వారా పండించే ఆకుకూరలు కూరగాయలను పరిశీలించారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు ఆకుకూరలు అందజేశారు. అంగన్వాడీ టీచర్ బి సత్యవతిని కలెక్టర్ ప్రశాంతి అభినందించారు. విలేకరులు అడిగిన ప్రశ్నకు కలెక్టర్ సమాధానం ఇస్తూ అంగన్వాడీ కేంద్రాల నుండి ఆహార పదార్థాలు సరుకులు బయటికి వెళ్లకుండా తనిఖీ చేయాలని తహసీల్దార్ కే రాజ్యలక్ష్మిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కే రాజ్యలక్ష్మి ఎంపీడీవో ఎస్ వేణుగోపాల్ రెడ్డి, యువ పీఆర్‌డీపీ రాజారావు ఐసిడిఎస్ పిడి విజయకుమారి, సిడిపిఓ నాగలక్ష్మి అంగన్వాడీ సూపర్వైజర్ విజయలక్ష్మి, దేవరపల్లి గ్రామ కార్యదర్శి ఎన్నో రవికుమార్ పంచాయతీరాజ్ ఏఈ వినోద్ కుమార్ ఆర్‌డబ్ల్యు ఏ ఈఈకుమారి నాగమల్లేశ్వరరావు అంగన్వాడీ సూపర్వైజర్లు విజయలక్ష్మి విజయశాంతి శశికళ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ జీజీహెచ్‌ని ఎంపీ ఉదయ్ పరిశీలన

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి (జీజీ హెచ్) ని గురువారం కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ పరిశీలించారు. ముందుగా ఆయన ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ లావణ్య కుమారి, వైద్యులు, సిబ్బందితో కలిసి ఆసుపత్రిలో ఎమర్జెన్సీ, క్యాజువాలిటీ, ట్రామా, సర్జికల్, మెటర్నిటీ, ఎంఆర్ఐ, సిటీ స్కాన్, టీబి వార్డ్, ఓపి, నర్సింగ్ స్కూల్ విభాగాలను పరిశీలించారు. అలాగే ఆస్పత్రి ఆవరణలో రూ.42 కోట్లతో నిర్మిస్తున్న మదర్ చైల్డ్ హెల్త్ బ్లాక్‌ను పరిశీలించారు. అనంతరం ఆసుపత్రిలో పలు వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రజా ప్రతినిధులు, ఆసుపత్రి వైద్యుల నుండి అభివృద్ధికి సంబంధించి వివరాలు సేకరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి నిధులను సమీకరించ చడంతో పాటు ఎంపీ లాడ్స్ నుండి అవసరమైన నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా యస్ లావణ్య కుమారి, డిప్యూటీ సూపరింటెండెంట్ డా పి శ్రీనివాసన్, ఆర్ఎంఒ డా ఎన్ రాజకుమారి, డిప్యూటీ కలెక్టర్ ఎన్ శ్రీధర్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

4 నుంచి అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహ తిరు కళ్యాణోత్సవాలు

విశాలాంధ్ర-అమలాపురం : అంతర్వేదిలో వేంచేసి యున్న శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వార్షిక తిరు కళ్యాణ మహోత్సవాలు ఫిబ్రవరి 4 నుండి 13వ తేదీ వరకు అత్యంత వైభవోపేతం, ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ జిల్లాస్థాయి అధికారులకు సూచించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ నందు అంతర్వేది ఉత్సవాల నిర్వహణపై రెండవదఫా సమావేశాన్ని జిల్లాస్థాయి అధికారులతో నిర్వహించారు. స్వామి వారి రథ సప్తమి, స్వామి వారి తిరు కళ్యాణోత్సవం శ్రీ స్వామివారి రథోత్సవం స్వామి వారి చక్రస్నానం ధ్వజారోహణ, హంస వాహనంపై తెప్పోత్సవ కార్యక్రమాలను పటిష్టమైన ముందస్తు ఏర్పాట్ల మధ్య నిర్వహించాలని ఆదేశించారు. దేవస్థానం, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేసేలా ఇప్పటి నుంచే సమాయత్తం కావాలన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం, తాగు నీరు, టాయిలెట్స్, పార్కింగ్, రవాణా, భక్తుల దర్శనం తదితర ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలన్నారు. మెరైన్ సివిల్ పోలీసులు సమన్వ యంతో భద్రతా ఏర్పాట్లు గావించాలన్నారు. ప్రధాన ఈవెంట్లలో మరింత అప్రమ త్తంగా వ్యవహ రించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. పంచాయతీరాజ్ ఎస్ఈ భక్తుల సౌకర్యార్థం మార్గనిర్దేశం చేసే సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా ఎస్పీ బి కృష్ణారావు మాట్లాడుతూ అధికారులు ఉత్సవ నిర్వహణ తీరుపట్ల తమకున్న సందేహాలను ముందుగానే నివృత్తి చేసుకొని పూర్తి సమన్వ యంతో ఉత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు. ఆర్డీవోలు పి శ్రీకర్, డిఅఖిల, కే మాధవి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నకిలీ జడ్జి అరెస్ట్

డీఎస్పీ వెల్లడి

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు : ఉద్యోగాలు ఇప్పిస్తామని యువతను నమ్మించి వారి వద్ద నుంచి లక్షల రూపాయలు వసూలు చేసిన నకిలీ జడ్జిని ఏలూరు మహిళా పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఏలూరులోని డిఎస్పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ కాంతి ప్రియతో కలిసి డిఎస్పి డి.శ్రావణ్ కుమార్ వివరాలు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలోని రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ గ్రామానికి చెందిన సామంతుల నరేందర్ కొన్నేళ్లుగా నకిలీ జడ్జి అవతారం ఎత్తి ఎందరో అమాయకులను మోసం చేసి లక్షల రూపాయలు కాజేశాడు. ఇదే కోవలో ఏలూరు నగరంలోని కొత్తపేటకు చెందిన నామాల నిర్మల అలియాస్ సామంతుల నిర్మలను మ్యాట్రిమోనీ ద్వారా 2019వ సంవత్సరంలో పరిచయం చేసుకొని 2022వ సంవత్సరంలో వివాహం చేసుకున్నాడు. నరేందర్ జడ్జి అని నమ్మించి నిర్మల తల్లిదండ్రుల వద్ద వివాహ సమయంలో రూ.25 లక్షలు వరకట్నంగా తీసుకున్నారు. అనంతరం నిర్మలను తీసుకొని ఖమ్మం జిల్లాలో కాపురం పెట్టి ఆమెను వేధింపులకు గురి చేశాడు. నిర్మల మరొక 50 లక్షల రూపాయలు అదనంగా వరకట్నం తీసుకురావాలని వేధింపులకు గురి చేస్తుండడంతో ఆమె ఏలూరులోని మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్సై కాంతి ప్రియను ఆశ్రయించింది. దీంతో కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ కాంతిప్రియ దర్యాప్తు ప్రారంభించగా ఆసక్తికర విషయాలు వెలుగు చూసాయి. వాస్తవానికి నరేందర్ నకిలీ జడ్జి అనే విషయం నిర్మలకు కూడా తెలియకుండా జాగ్రత్త పడుతూ ఈ మోసాలకు పాల్పడుతూ వచ్చాడు. ఈ విషయం పోలీసుల దర్యాప్తులో తేలడంతో పోలీసులు అవాక్కయ్యారు. నిందితుడిపై ఇప్పటికే ఖమ్మం, వరం గల్ జిల్లాలో పలు కేసులు నమోదైనట్టు గుర్తించారు. నరేందర్ గతంలోనే అనేక మోసాలకు పాల్పడి ఎంతో మంది యువతీ యువకుల జీవితాలతో ఆటలాడుకున్నట్లు గుర్తించడంతో ఎస్సై కాంతిప్రియకు అందిన సమాచారం మేరకు విశాఖపట్నం వెళ్లేందుకు ఏలూరు రైల్వే స్టేషన్‌లో సిద్ధంగా ఉన్న నరేందర్‌ను ఎంతో చాకచక్యంగా అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. డీఎస్పీ శ్రావణ్ మాట్లాడుతూ ఎవరైనా ఉద్యోగాల పేరుతో సొమ్ము డిమాండ్ చేస్తే వెంటనే పోలీసులకు సమాచారాన్ని అందించాలన్నారు.వివాహాల సమయంలో వ్యక్తుల పై అనుమానం ఉంటే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో గాని లేదా 112 గాని ఫోన్ ద్వారా సంప్రదిస్తే సదరు వ్యక్తి వివరా లను గోప్యంగా విచారించి వాస్త వాలు తెలియజేస్తామని చెప్పారు. ఇటువంటి వ్యక్తుల మాటలకు మోసపోకుండా తగు జాగ్రత్తలు పాటించాలని డిఎస్పి శ్రావణ్ కుమార్ సూచించారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

విశాలాంధ్ర - పెదపూడి : పెదపూడి మండలం పైనలో రూ.1.80 లక్షలతో నిర్మించే గోకులం ఎమ్మెల్యే నల్లమిల్లి రామ కృష్ణారెడ్డి ప్రారంభించారు. గురువారం పైన గ్రామం నుండి చింతపల్లి లాకుల వరకు ఎంజిఎన్ఆర్జి ఈఏస్ నిధులు రూ.60 లక్షలతో నిర్మించే బిటి రోడ్డుకు ఎమ్మెల్యే నల్లమిల్లి శంకుస్థాపన చేశారు. గొల్లల మామిడాడ పరిధిలో మెయిన్ రోడ్డు డీఎంఎఫ్ నిధులు రూ.90లక్షల వ్యయంతో నిర్మించే సిసి రోడ్డుకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అధికారులు, ఎన్డీఏ నేతలు, కార్య కర్తలు పాల్గొన్నారు.

యువగళంతో అందరి మన్ననలు పొందిన లోకేష్

- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కె.ఎస్ జవహర్
- రుడా ఛైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి

విశాలాంధ్ర - రాజానగరం, సీతానగరం : యువగళం పేరిట ఏపీ రాష్ట్రంలో పాదయాత్ర చేపట్టి ప్రజల సమస్యలను తెలుసుకుంటు అందరి మన్ననలు పొందిన ఘనుడు నారా లోకేష్ అని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సామ్యూల్ జవహర్ అన్నారు.టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐటీశాఖ మంత్రి నారా లోకేష్ 42వ జన్మదినాన్ని పురస్కరించుకుని రాజమహేంద్ర వరం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్,రాజానగరం నియోజకవర్గ ఇన్చార్జ్, రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకటరమణ చౌదరి ఆధ్వర్యంలో నియో జకవర్గంలోని బూరుగుపూడి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురు వారం భారీ ఎత్తున ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కె.ఎస్ జవహర్ మాట్లాడుతూ యువనాయకుడిగా లోకేష్ ఎంతో మంచి పేరు సంపాదించుకున్నరని చెప్పారు.యువగళంతో తన సత్తా ఏంటో మరోసారి నిరూపించారన్నారు. ఎన్నికల ముందే జన హృదయాలు గెలిచి టీడీపీకి ప్రాణం పోశారన్నారు.ఇటీవల కాలంలో కోటి సభ్యత్వాలు నమోదు చేసి నాయకులకు కార్యకర్తలకు భరోసా కల్పించి టీడీపీ పార్టీ పూర్వవైభవం తీసుకొచ్చారని కొనియాడారు.వేడుకలు అధ్యక్షత వహించిన రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ యువగళం పాదయాత్రతో టిడిపిను అధికారంలోకి తీసుకువచ్చి తండ్రికి తగ్గ తనయుడు అని నిరూపించార న్నారు. 226 రోజుల్లో 3,132 కిమీ పాదయాత్రతో ప్రజల సమస్యల కోసం నిరంతర కృషి చేసి విజయం సాధించడం మామూలు విషయం కాదన్నారు. టీడీపీకి ఆశాకిరణమై ఎదిగి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్తు కోసం లోకేష్ నిరంతరం శ్రమిస్తున్నారని చెప్పారు.రక్తదానం చేసిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞ తలు చెప్పారు. తొలుత స్వయంగా రక్తాన్ని అందించిన బొడ్డు వెంకట రమణ చౌదరి, అందరికీ ఆదర్శంగా నిలిచారు. దీనిలో భాగంగా భారీ కేకు కోసి అభిమానులకు పంచారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీల కులు, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు కొత్తపల్లి ఆశిష్ లాల్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగిశెట్టి చంటిబాబు, తెలుగు యువత జిల్లా అధ్యక్షులు కందుల బాబు రాయుడు, యాదవ కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు (నాగు), ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి ఖండవల్లి లక్ష్మి,మండల నాయకులు చిత్తిప్రోల్ల పద్దరాజు, నీలపాల అరవరాజు,అత్రు రాజేష్, సోద సాని త్రిమూర్తులు, వలవల రాజా, చిట్టూరి రంగారావు, చంద్రు ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు,ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.